
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

ఖమ్మం
KHAMMAM
శనివారం, 14 జూన్ 2025



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం కండి

- గెలుపే లక్ష్యంగా పనిచేయండి
- ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రచారం చేయండి
- కార్యకర్తలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు
- 25 లోపు రైతుభరోసా అందిస్తామని వెల్లడి

ఖమ్మం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సన్నద్ధం కావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రఘునాథపాలెం మండలం బాలప్పేటలోని ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్‌కు చెందిన వ్యవసాయక్షేత్రంలో మండల ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి తుమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నివిధాల అప్పుల పాలు చేసినా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని ప్రకటించారు. ఏడాదిన్నరగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి.. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. రైతుబంధు, రైతు భరోసా లాంటి వాటి గురించి ప్రజలకు వివరించి.. (మిగతా 6వ పేజీలో)

ఇసుక క్వారీ.. ఉపాధికి దారి

- ఇసుక లారీలకు పట్టాలు కట్టడంతో దండిగా ఆదాయం
- రోజుకు రూ.3వేల వరకు సగటు కూలి
- సభ్యత్వం ఉన్న వారికి బోనస్ రూపంలో ఆదాయం
- గిరిజనులకు ఒక్క సీకత్తి గూడెం ర్యాంపు నుంచే రూ.8 కోట్ల రాక

7



చర్ల మండలం సీకత్తిగూడెం ర్యాంపులో పనిచేస్తున్న కూలీలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు పలు నిర్మాణ సంస్థలు రంగంలో దిగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పేద వర్గాల ప్రజలకు రూ.5లక్షల వ్యయంతో ఇందిరమ్మ గృహాలు నిర్మించడానికి కార్యాచరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకాన్ని విజయవంతం చేయాలన్న పట్టుదలతో ఎమ్మెల్యేలు లబ్ధిదారులను వివిధ రీతుల్లో చైతన్య పరుస్తున్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

'ఇందిరమ్మ'లో కాంట్రాక్టర్లు!

- రంగంలోకి దిగుతున్న పలు నిర్మాణ సంస్థలు
- గృహ లబ్ధిదారులతో ఒప్పందాలకు సమావేశాలు
- ఇంటిని ఎలా నిర్మిస్తారో తెలుపుతూ వీడియో ప్రదర్శనలు
- లక్ష్య సాధనే ధ్యేయంగా ప్రజాప్రతినిధుల చొరవ
- పేదలకు నిర్మాణ భారం, ఆర్థిక ఇక్కట్లు తొలగేనా?

ఇల్లెందు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొద్ది సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వాలు పక్కా ఇళ్ల నిర్మాణాల్లో తొలుత లబ్ధిదారులే పెట్టుబడులు పెట్టుకుని.. బేస్మెంట్ లెవల్, లెంటల్ లెవల్, స్లాబ్ లెవల్ స్థాయిల్లో బిల్లులు క్లైం చేసేవారు. ఈ క్రమంలో పేదలు పెట్టుబడుల కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చేవారు. అయినప్పటికీ పూర్తి స్థాయిలో ఇళ్లు నిర్మించుకోలేక అర్ధాంతరంగా నిలిపివేసిన వారు చాలామందే ఉన్నారు. నేటికి గ్రామాల్లో చాలా ఇళ్లు మొండిగోడలు, బేస్మెంట్ దశలోనే కనిపిస్తుంటాయి. అలాగే చాలామంది లబ్ధిదారుల ఇళ్లు పూర్తి చేసినా.. అందుకు చేసిన అప్పులను తీర్చడానికి సతమతమవుతున్న వారు నేటికీ ఉన్నారు. ఈ పరిణామాలను గమనించిన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని సంపూర్ణంగా అమలు చేయాలన్న పట్టుదలతో లబ్ధిదారులకు చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ నమూనాలను వీడియో చిత్రాల ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రదర్శనలు చేయిస్తోంది. ఈ క్రమంలో ఇల్లెందు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉన్న నిర్మాణ సంస్థల కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ పెట్టుబడుల భారం లేకుండా ఇంటి నిర్మాణాన్ని సంపూర్ణంగా పూర్తి చేసి ప్రశాంతంగా గృహ ప్రవేశం చేయించేలా సిద్ధంగా ఉన్నట్టు ప్రకటిస్తుండటం గమనార్హం. ఈ మేరకు ఇల్లెందు నియోజకవర్గంలోని గ్రామాల్లో, మండలాల్లో, పట్టణంలో గృహనిర్మాణాల డెమోలను ప్రదర్శిస్తూ లబ్ధిదారులు, కాంట్రాక్టర్ల మధ్య ఒప్పందాలు కుదిర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.




వీడియోలో ప్రదర్శిస్తున్న ఇందిరమ్మ ఇంటి నమూనా

కాంట్రాక్టర్లు ఇస్తున్న హామీలేంటంటే..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మానానికి కాంట్రాక్టు నిర్మాణ సంస్థల ప్రతినిధులు లబ్ధిదారుల సమావేశాల్లో పలు హామీలిస్తున్నారు. తాము ఇంటిని ఎలా నిర్మిస్తామో వివరిస్తూ వీడియో చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. మొదటి దశలో 400చదరపు అడుగుల స్థలంలో నిర్మించేనమూనా ఇంటిని ఫైలింగ్ చేసే మిషన్‌తో పునాదుల డ్రిల్ వేస్తామని, 12ఎంఎం గేజ్ స్టీల్ రాడ్లతో 9గుంతలతో కాంక్రీట్ పిల్లర్లు ఏర్పాటు చేస్తామని వివరిస్తున్నారు. అదే విధంగా రెండోదశలో రెండు అడుగుల ఎత్తు, 8ఇంచుల మందంతో స్టీల్‌తో బేస్మెంట్ల నిర్మాణం చేపడుతామని బేస్మెంట్ నుంచి తొమ్మిదిన్నర అడుగుల ఎత్తువరకు సిమెంట్ బ్లాకులతో గోడ నిర్మాణం చేస్తామని చెబుతున్నారు. అదే విధంగా 450 అడుగుల స్లాబ్ వరకు నిర్మించడం కాంక్రీట్ కిటికీలు, వెంటిలేటర్లు, డోర్లు సమకూరుస్తామని వివరిస్తున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత లబ్ధిదారులే ప్లాస్టింగ్ సమయంలో (మిగతా 6వ పేజీలో)

కలెక్టర్‌గా అనుదీప్ బాధ్యతలు

శుభాకాంక్షలు తెలిపిన అదనపు కలెక్టర్లు, అధికారులు



ఖమ్మం, జూన్ 13 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఖమ్మానికి బదిలీ అవగా.. ఇక్కడ పని చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సివిల్ సప్లయీస్ కమిషనర్‌గా వెళుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన అనుదీప్‌కు కలెక్టరేట్ ఉద్యోగులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుదీప్‌కు అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో పద్మశ్రీ, జడ్పీసీఈవో దీక్షారైనా, ఆర్డీవో నరసింహారావు, కలెక్టరేట్ అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన ఉపాధికి గ్రహణం

- రెండేళ్లుగా ఇసుక క్వారీలకు అనుమతులు శూన్యం
- ఉపాధి కోల్పోయిన గిరిజన సొసైటీలు
- గోదారి పరివాహకంలో పదుల సంఖ్యలో ఇసుక రీచ్‌లు
- అక్కడ అడ్డురాని నిబంధనలు ఇక్కడెందుకు?
- కలెక్టర్ సారూ, మా గోడు పట్టించుకోరూ?
- సొసైటీల గిరిజనుల ఆవేదన

6

ఉద్దీపకానికి మరిన్ని మెరుగులు!

- ప్రాథమిక విద్య పటిష్టానికి ఐటీడీఏ కసరత్తు
- గిరి బిడ్డలకు మెరుగైన విద్యనందించేలా పీవో చొరవ
- ఈ ఏడాది నుంచి 1, 2 తరగతులకు సైతం అమలు
- 6, 7 విద్యార్థులకు ఉద్దీపకం-2 అందించేలా చర్యలు
- ఫలితాల్లో వెనుకబడి ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి
- కార్యాచరణ సిద్ధం చేసిన పీఎంఆర్‌సీ

భద్రాచలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ఆరంభమైన నేపథ్యంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరి బిడ్డలకు మరింత మెరుగైన విద్యను అందించేందుకు ఐటీడీఏ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రాథమిక స్థాయిలోనే విద్య పటిష్టతకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత పాఠశాలలకు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గతేడాది డిసెంబరులో చిన్నారుల కోసం రూపొందించిన ఉద్దీపకం పుస్తకాన్ని ఈ ఏడాది జూన్ 25నుంచి విద్యార్థులకు అందజేసి జూలై ఒకటి నుంచి ఉద్దీపం వర్క్‌బుక్‌పై ప్రాక్టీసు చేయించనున్నారు. అయితే గతం కన్నా ఈ ఉద్దీపకం పుస్తకాన్ని మరింత మెరుగ్గా తయారు చేయనున్నామని, తద్వారా విద్యార్థుల్లో భాషపై పట్టు పెరిగే అవకాశం ఉంటుందని



అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 45 ఆశ్రమ పాఠశాలలకు చెందిన 2,173 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 2022 మంది ఉత్తీర్ణత సాధించారు. 2023-24 విద్యా సంవత్సరంలో 90.60 శాతం ఫలితాలు రాగా 2024-25లో 93.05శాతం ఫలితాలు వచ్చాయి. 2025-26 విద్యా సంవత్సరంలో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా బోధన సాగేందుకు ఇప్పటికే ఐటీడీఏ పరిధిలోని విద్యావిభాగంకు చెందిన ప్రాజెక్టు మానిటరింగ్ రిసోర్సు సెంటర్(పీఎంఆర్‌సీ) ప్రణాళికను అమలు చేయనుంది. ఇదిలా ఉండగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ ప్రత్యేక చొరవతో సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ సహకారంతో 219జీపీఎస్‌ల్లోని 3,265 మంది విద్యార్థులకు 6,530 నోట్ పుస్తకాలను అందజేశారు. కాగా ఈ నెల 20వతేదీ నుంచి 25వరకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

ఈ ఏడాది నుంచి 1, 2 తరగతులకు కూడా అందజేత

గతేడాది డిసెంబర్లో ఆశ్రమ పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులకు లెక్కలు, ఆంగ్లానికి చెందిన ఉద్దీపకం పుస్తకాలు చదువుల్లో వెనుకంజలో ఉండే వారికి అందజేశారు. కాగా ఈ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే జూన్ 25 నుంచి ఈ ఉద్దీపకం పుస్తకాలను అందజేసేందుకు చర్యలు చేపట్టారు. 219 జీపీఎస్ పాఠశాలల్లో సుమారు 150మంది విద్యార్థులకు తొలిసారిగా తెలుగు ఉద్దీపకం పుస్తకాలను అందజేయనున్నారు. మూడో తరగతిలో 116 మందికి, నాలుగో తరగతిలో 343మందికి, ఐదో తరగతిలో 821 మందికి ఆంగ్లం, లెక్కలు ఉద్దీపకం పుస్తకాలను అందజేయనున్నారు. వీటిని గత పుస్తకాలకు భిన్నంగా సులభమైన పద్ధతిలో విద్యార్థులకు నేర్చుకునేలా రూపొందించినట్టు విద్యా విభాగం (మిగతా 6వ పేజీలో)



ముజమ్మిల్‌ఖాన్‌ను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

జిల్లా అభివృద్ధికి శ్రమించారు

- పూర్వ కలెక్టర్‌కు మంత్రి తుమ్మల ప్రశంసలు
- బదిలీపై వెళుతున్న ముజమ్మిల్‌ఖాన్‌కు ఘన సన్మానం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):'ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఎంతో శ్రమించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, నిర్వహణతో పాటు పథకాలను క్షేత్రస్థాయిలోని లబ్ధిదారులకు అందేలా కృషి చేశారు' అంటూ పూర్వ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశంసించారు. బదిలీపై వెళుతున్న క్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయానికి వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ముజమ్మిల్‌ఖాన్‌ను సత్కరించారు. ఈక్రమంలో కలెక్టర్‌గా జిల్లాలో బాధ్యతలు నిర్వహించిన కాలాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు మిక్కిలినేని నరేంద్ర, ముస్తాఫా పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి
- మూడు రోజుల్లో కుమార్తె వివాహం
- నెలాఖరులో పదవీ విరమణ
- పెళ్లి కార్డులు పంచి వస్తుండగా అడ్డొచ్చిన కోతులు
- అదుపుతప్పి అడవిలోకి దూసుకుపోయిన ద్విచక్రవాహనం
- ఇల్లెందులో ఘటన



పిల్లి ఏసుదాసు (ఫైల్)

ఇల్లెందు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆయన సింగరేణి కార్మికుడు. ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయాల్సి ఉంది. అంతేకాదు మరో మూడు రోజుల్లో ఆయన మూడో కుమార్తె వివాహం. ఇంతలోనే విధి వక్రించింది. రోడ్డు ప్రమాదం రూపంలో ఆయన్ను బలి తీసుకుంది. పెళ్లి బాజా మోగాల్సిన ఆ ఇంట తీరని విషాదాన్ని మిగిలించింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలివీ.. భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణానికి చెందిన పిల్లి ఏసుదాసు అలియాస్ శ్రీనివాసరావు (60) సింగరేణి సంస్థలో కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఈ నెలాఖరున ఆయన పదవీవిరమణ కూడా చేయాల్సి ఉంది. అలాగే మరో మూడు రోజుల్లో తన మూడో కుమార్తె వివాహం ఉండగా.. శుక్రవారం బంధుమిత్రులకు కార్డులు పంచడానికి ద్విచక్ర వాహనంపై గుండాల వైపు వెళ్లాడు. కార్డులు పంచి తిరిగి వస్తుండగా అందుగులబోడు వద్ద రోడ్డుపై కోతులు అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి అడవిలోకి దూసుకుపోయింది. దీంతో ఏసుదాసు అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా మూడు రోజుల్లో కూతురు పెళ్లి జరుగుతుండటం, నెలాఖరున పదవీవిరమణ ఉందన్న ఆనందంతో ఉన్న ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏసుదాసు మృతితో సింగరేణి కార్మికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

సౌదీలో డ్రైవర్ ఉద్యోగమని చెప్పి..

- అక్కడకు వెళ్లాక వ్యవసాయ పనులు
- ఏజెంట్ చేతిలో మోసపోయిన ఇల్లెందు వాసి
- క్షీణించిన ఆరోగ్యం.. భారత్‌కు రప్పించండి
- ప్రవాసి ప్రజావాణిలో బాధితుడి భార్య వినతి



ప్రవాసీ ప్రజావాణిలో ఎన్నారై కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అలేఖ్య

బేగంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తన భర్తను ఇంట్లో డ్రైవర్ పనికని తీసుకెళ్లి, అక్కడకు వెళ్లాక వ్యవసాయ పనులు చేయించడంతో ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందని, తన భర్తను తిరిగి దేశానికి రప్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన అలేఖ్య అనే మహిళ శుక్రవారం ప్రవాసీ ప్రజావాణిలో విన్నవించుకున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన ఆ వినతి పత్రాన్ని ఎన్నారై కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్‌కు అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలివీ.. ఇల్లెందుకు చెందిన గుడిసె యాకూబ్‌ను సౌదీలోని ఓ ఇంట్లో డ్రైవర్ పని ఉందని ముంబయికి చెందిన ఓ ఏజెంట్ నమ్మించి సౌదీలోని దమ్మాంకు పంపించాడు. అక్కడకు వెళ్లిన అనంతరం ఆ ఇంటి యజమాని యాకుబ్‌తో వ్యవసాయ పనులు చేయించడంతో అతడి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. దీంతో యాకుబ్ విషయాన్ని కుటుంబసభ్యులతో పాటు పంపిన ఏజెంట్‌కు తెలియజేశాడు. కానీ ఏజంట్ నుంచి స్పందన లేక పోవడంతో.. చివరకు బాధితుడి భార్య అలేఖ్య సీఎం ప్రజావాణిలోని ప్రవాసీ ప్రజావాణిలో తెలంగాణ ప్రభుత్వ నియమిత ఏన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ డా. బి.ఎం.వినోద్‌కుమార్, వైస్‌చైర్మన్ మంద భీంరెడ్డిలను కలిసి వినతి పత్రం ఇచ్చారు. తన భర్తను సురక్షితంగా దేశానికి రప్పించేలా కృషి చేయాలని కోరారు. అక్కడ సరైన భోజనం కూడా పెట్టకపోగా వసతి సౌకర్యం కల్పించడంలేదని ఈ సందర్భంగా వారికి ఆమె వివరిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు.

నీటి విడుదల సాధ్యమేనా?

- కొనసాగుతున్న వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల ఆధునికీకరణ పనులు

6


'గిరి' పల్లెల్లో మలేరియా

- రెడ్డిగూడెంలో గిరిజనుడి మృతి
- ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసిన అధికారులు

7

జిల్లాలో కొవిడ్ కలకలం

- ఆపరేషన్ కోసం వచ్చిన సూర్యాపేట మహిళకు నిర్ధారణ
- ఖమ్మం జిల్లా ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో చికిత్స



ఖమ్మం కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల తర్వాత ఖమ్మంలో కొవిడ్ కేసు నమోదైంది. మధ్య మధ్యలో పలువురిలో లక్షణాలున్నాయంటూ వార్తలొచ్చినా ఎక్కడా నిర్ధారణ కాలేదు. కానీ ఆపరేషన్ కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చిన సూర్యాపేట జిల్లాకు చెందిన 65ఏళ్ల మహిళకు కరోనా నిర్ధారణ కావడంతో అధికారులు, సిబ్బంది హైరానా పడుతున్నారు. ఆపరేషన్ కోసమంటూ సదరు మహిళ ఆస్పత్రిలో చేరగా.. ఆపరేషన్‌కు ముందు చేసే పరీక్షల్లో భాగంగా కొవిడ్ నిర్ధారణ పరీక్ష చేయగా ఆమెకు పాజిటివ్ వచ్చింది. దీంతో ఆమెను ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. అయితే ఆమెకు తీవ్రమైన కరోనా లక్షణాలేవీ లేవని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. కానీ ప్రజలు విధిగా మాస్కులు ధరించాలని, జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఏదేమైనా మూడేళ్ల తర్వాత మళ్లీ కరోనా కేసు నమోదవ్వడంతో జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ కళావతిబాయి, ఖమ్మం జిల్లా వైద్యాధికారి

జిల్లాలో కొవిడ్ ముప్పును ఎదుర్కొనేలా సన్నద్ధమవుతున్నాం. జిల్లా కేంద్రంతోపాటు మిగతా ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నాం. ప్రజలు ఎవరూ అధైర్యపడొద్దు. మరింత అప్రమత్తంగా ఉండాలి. మాస్కులు తప్పనిసరిగా పెట్టుకోవాలి. గుంపులు గుంపులుగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా ఉండడమే మంచిది. జ్వరం, జలుబు లాంటివి ఉన్నప్పుడు వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి.

పాజిటివ్ వచ్చిందా.. భయపడొద్దు

- కరోనానే కాదు.. ఏవ్యాధి సోకినా జాగ్రత్తలు అవసరం
- నిత్య వ్యాయామం తప్పనిసరి
- ఆహారపు అలవాట్లే శ్రీరామరక్ష
- పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



ఖమ్మం కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఒంట్లో నలతగా ఉందని పరీక్ష చేయించుకుంటే రిపోర్ట్ కరోనా పాజిటివ్ వచ్చింది. ఇక నెగెటివ్ ఆలోచనలు మానుకోండి. అంతేకాదు మీరు టీకా వేయించుకుని ఉంటే అసలు భయపడాల్సిన పనేలేదు.ఆరోగ్యపరమైన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు పాటించకుండా జీవనశైలిలో ఏమైనా తేడా ఉంటే కరోనానే కాదు ఏ వ్యాధి సోకినా నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే. కరోనా మొదటి, రెండోదశలో వ్యాధితో కన్నా వ్యాధిపట్ల భయంతోనే దాదాపు చాలామంది మృత్యువాత పడ్డారు. మరోవైపు నిర్లక్ష్యం కూడా కొందరి జీవితాలను చిదిమేసింది. ప్రస్తుతం కరోనా ప్రభావం అంతగా లేదు. రిపోర్ట్ పాజిటివ్ వచ్చినా లక్షణాలు కనిపించకుండా ఒంట్లో నలతగా ఉన్నా.. భయపడాల్సిన పనిలేదు. మొదటి దశలో వైద్యులే ఆందోళన చెందారు. దీంతో వ్యాధి నయమవడానికి కొంత ధర ఎక్కువ ఉన్న మందులే రాశారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. వ్యాధి తీవ్రత అంతగా లేదు. తక్కువ ధరకే మందులు వస్తున్నాయి. సరిగ్గా వారం పాటు ఇంట్లో ఉండి వైద్యులు చెప్పిన జాగ్రత్తలు పాటిస్తే చాలు..

ఆహారపు అలవాట్లే రక్ష

మన ఆహారపు అలవాట్లే శరీరానికి రక్ష. కరోనా సోకిందనగానే జంక్‌ఫుడ్, కారం, ఉప్పు, నూనె ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తినకూడదని వైద్యులు సూచిస్తున్నారు. అసలు కరోనాతో సంబంధం లేకుండానే వీటికి దూరంగా ఉండాలి. వైరస్ బారిన పడితే ప్రొటీన్‌తో కూడిన ఆహారం తీసుకుంటే మంచిది. దీనికి తోడు డ్రై ఫ్రూట్స్ తీసుకుంటే బలాన్నిస్తాయి. జంక్ ఫుడ్, రుచికరమైన ఆహార పదార్థాలతో అప్పటికప్పుడు హుషారుగా, శక్తి వచ్చినట్లు అనిపించొచ్చు. కానీ క్రమేణా శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది.

జీవనశైలికి ప్రాధాన్యమివ్వండి

జీవనశైలిని అందరూ ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలి. కరోనా, ఇతర వ్యాధులు వచ్చాయని తెలియగానే యోగా, వ్యాయామాలు చేస్తున్నారు. అయితే ఈ అలవాటు మొదటి నుంచి ఉండాలి. దీనితోపాటు నడక అలవాటు కూడా ఉండాలి. ఉదయాన్నే దోర ఎండలో అరగంటసేపు గడిపితే 'డి' విటమిన్ శరీరంలోకి చేరుతుంది. తద్వారా రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. రోజుకి 8 గంటలు నిద్రపోవడం ముఖ్యం. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. కోపతాపాలకు తావివ్వకుండా సరదాగా, నవ్వుతూ ఉండండి. హుషారు కలిగించే సంగీతం వింటే మానసిక ఉల్లాసం పెంపొందుతుంది.

మనసుకు ప్రశాంతత అవసరం

కరోనా ఇతరత్రా జ్వరం రాగానే ఏదో అయిపోతుందనే భ్రమలో ఉంటారు. దీనికితోడు సామాజిక మాధ్యమాల్లో వచ్చే చెడు వార్తలను చూసి లేనిపోని ఆందోళన చెందుతుంటారు. ఇది చాలా ప్రమాదకరం. భయపడితే ఒత్తిడి పెరిగి శరీరంలో పెనుమార్పులు చోటుచేసుకుంటాయి. వ్యాధి పెరుగుతుంది. వాటి గురించిన చర్చలకూ దూరంగా ఉండాలి. ఆత్మవిశ్వాసంతో ఉండాలి. వ్యాధి సోకిందనే ఆలోచన వద్దు. దాని గురించి పట్టించుకోకుండా రోజువారీ పనులు ఎప్పటిలాగే చేసుకోవాలి.

శుభ్రతపై దృష్టి పెట్టండి

వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. ఈ సమయంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. బయటి నుంచి ఇంటికి రాగానే కాళ్లు చేతులు శుభ్రం చేసుకోవడం, తినేముందు విధిగా చేతులను శుభ్రం చేసుకోవాలి. ఆహారాన్ని కూడా వేడిగా ఉన్నప్పుడే తినాలి. చేతులకు బాక్టీరియా దరిచేరినా అంతమొందేలా శానిటైజర్ వినియోగించాలి.ముఖ్యంగా జలుబు, జ్వరం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. మాస్కును విధిగా ధరించాలి.

గిరిజన ఉపాధికి గ్రహణం

- రెండేళ్లుగా ఇసుక క్వారీలకు అనుమతులు శూన్యం
- ఉపాధి కోల్పోయిన గిరిజన సొసైటీలు
- గోదారి పరివాహకంలో పదుల సంఖ్యలో ఇసుక రీచ్‌లు
- అక్కడ అడ్డురాని నిబంధనలు ఇక్కడెందుకు?
- కలెక్టర్ సారూ, మా గోడు పట్టించుకోరూ?
- సొసైటీల గిరిజనుల ఆవేదన



వీరాపురం గిరిజన సొసైటీ ఇసుక రీచ్ (ఫైల్)

పినపాక, 13 జూన్ (ఆంధ్రజ్యోతి) : అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు ఉంది ఈ మండల ఆదివాసీ గిరిజన సొసైటీ సభ్యుల పరిస్థితి. ఆదివాసీ గిరిజనులు అభివృద్ధి చెందేందుకు స్థానికంగా లభ్యమయ్యే వనరులను వినియోగించుకుని అభివృద్ధి చెందాలనే ప్రభుత్వం, ఐటీడీఏ, పీసా చట్టాల లక్ష్యం నీరుగారుతోంది. ముఖ్యంగా గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు ప్రధాన వనరుగా ఉన్న గోదావరి నదిని వినియోగించుకుని, సొసైటీలను ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఉపాధి చూపుతూ, అభివృద్ధికి బాటలు వేయాలనే లక్ష్యం పక్కదారి పడుతోంది. అంతేగాక గోదావరి వరదల కారణంగా ఇసుక మేటలు వేసిన భూముల్లో డీసిల్టింగ్ ద్వారా భూములను సాగుకు యోగ్యంగా మార్చుకునేందుకు కూడా అవకాశం లేకుండాపోతోంది. సహజ వనరులనే నమ్ముకుని బతికే గిరిజనులకు ఉపాధి కరవైంది. రాష్ట్రంలో గోదావరి ప్రవహించే ప్రధాన జిల్లాలైన ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వందల ఇసుక రీచ్‌లు ఏర్పాటు జరిగి విస్తృతంగా నడుస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఒక్క మణుగూరులోనే 9 ఇసుకరీచ్‌లు, గోదావరి ఆవల ఉన్న చర్ల మండలంతో పాటు, పక్కనే ఉన్న ములుగు జిల్లా మంగపేట, ఏటూరునాగారం మండలాల్లోనూ పదుల సంఖ్యలో ఇసుక రీచ్‌లు నడుస్తున్నాయని, అక్కడెక్కడా అడ్డురాని నిబంధనలు ఒక్క పినపాక మండలంలోనే ఎందుకు వస్తున్నాయని ఆదివాసీ గిరిజన సొసైటీల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇక్కడ ఇసుక రీచ్‌లు ప్రారంభించడానికి జిల్లా అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి తమకు ఉపాధి కల్పించమని కోరే ఆదరువు లేదని, ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న తమ గోడును జిల్లా అధికారులు పట్టించుకుని ఉపాధి చూపాలని గిరిజన సొసైటీలు వేడుకుంటున్నాయి.

గిరిజన సొసైటీలకు ఉపాధి కల్పించాలి

గొగ్గలి రామకృష్ణ, జాతీయ ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు



పినపాక మండలంలో దాదాపు 6 గిరిజన ఇసుక సొసైటీలు ఉన్నప్పటికీ, ఏ ఒక్క సొసైటీకి ప్రస్తుతం పనులు లేవు. గత రెండేళ్లుగా ఉపాధి లేక గిరిజన సొసైటీల సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. కాని జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు పినపాక మండలంపై ఎందుకు వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదు. ఇక్కడి గిరిజనులకు ఉపాధి చూపే విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేస్తున్నాం.

నీటి విడుదల సాధ్యమేనా..?

కొనసాగుతున్న వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల ఆధునీకరణ పనులు

వైరా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రూ.42.10కోట్లతో వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల రెండోదశ ఆధునీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అయితే ఇప్పటికే ఖరీఫ్ వ్యవసాయ సీజన్ మొదలుకావడంతో ముందుగా ప్రకటించిన విధంగా ఈ కుడి, ఎడమకాల్వల పరిధిలో వరినార్లు పోసుకోవడానికి నీరు విడుదల సాధ్యమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్‌లోనే రిజర్వాయర్ నుంచి కాల్వలకు నీరు విడుదల చేస్తామని, జూలైలో నాట్లు పూర్తి చేయిస్తామని ఇటీవల స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రతివేదికపై పదేపదే చెపుతున్నారు. అయితే రబీ వ్యవసాయ సీజన్ ఆలస్యంగా ముగిసింది. ఏప్రిల్ 30 వరకు ఈ రెండు కాల్వల్లో నీటి సరఫరా జరిగింది. ఆవెంటనే కాల్వల ఆధునీకరణ పనులు ప్రారంభించటంలో కొంత జాప్యం జరిగింది. ఈ సమయంలో ఆధునీకరణ పనుల్లో జాప్యంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, నీటిపారుదలశాఖ అధికారులు గత నెలలో ఆధునీకరణ పనులను ప్రారంభించారు. కాంట్రాక్టర్ భారీస్థాయిలో యంత్రాలను, కూలీలను తీసుకొచ్చి శరవేగంగా రాత్రింబవళ్లు పనులు చేయిస్తున్నారు. కుడికాల్వలో 6.5 కిలోమీటర్లు సిమెంట్ గైడ్‌వాల్స్, మరో 6.5 కిలోమీటర్ల దూరం లైనింగ్ వాల్ నిర్మించాల్సి ఉంది. అయితే ఇప్పటికీ కుడికాల్వలో నాలుగు కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మాణం జరిగింది. ఇంకా 2.5 కిలోమీటర్ల దూరం నిర్మించాల్సి ఉంది. ఇది పూర్తికావడానికి ఇంకా 15 రోజుల సమయం పడుతుంది. ఎడమకాల్వలో లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్‌లో వారంరోజుల నుంచి సిమెంట్ గైడ్‌వాల్స్ పనులను ప్రారంభించారు. ఇది పూర్తికావడానికి పదిరోజుల సమయం పడుతుంది. మరో కిలోమీటర్ దూరం లైనింగ్ వాల్ నిర్మించాల్సి ఉంది. ఇదే ఎడమకాల్వలో గరికపాడు వెళ్లే కాల్వలో 1.75 కిలోమీటర్ల దూరం సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మించాల్సి ఉంది. ఇంకా ఆ పనులు ప్రారంభం కాలేదు. గరికపాడు కాల్వలో అంతే దూరం లైనింగ్‌వాల్స్ నిర్మించాల్సి ఉంది. అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఈ కాల్వలో ఈ ఏడాది పనులు చేయటం కష్టసాధ్యమని అధికారులు భావిస్తున్నారు. కుడికాల్వలో గైడ్‌వాల్స్ ఎడమకాల్వ లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్‌లో గైడ్‌వాల్స్‌ను మాత్రం ఈ ఏడాది పూర్తిచేసి ఖరీఫ్ సీజన్‌కు నీరు సరఫరా చేసేవిధంగా వెసులుబాటు ఇవ్వాలని అధికారుల ఆలోచనగా ఉంది. మిగిలిన లైనింగ్‌వాల్స్ ఇతర పనులను వచ్చే రబీ సీజన్ తర్వాత చేపట్టి పూర్తిచేయాలని భావిస్తున్నారు. కుడికాల్వ నాల్గో నెంబర్ డిస్ట్రిబ్యూటరీ డ్రాప్ శిథిలావస్థలో ఉండగా దాన్ని తొలగించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 15.1అడుగుల నీటిమట్టం ఉంది. దీని పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు. కొన్ని దశాబ్దాల కాలంలోనే ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రోహిణికార్తెలో భారీ వర్షాలు కురిసి ఒక అడుగుమేర నీటిమట్టం పెరగటం విశేషం. నాగార్జున్‌సాగర్‌లో నీటి లభ్యత లేకపోయినప్పటికీ జూన్‌లో సీతారామ నుంచి గోదావరి జలాలను రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు తీసుకువచ్చి ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్‌లో వైరా ఆయకట్టుకు నీరు విడుదల చేసి, జూలైలో నాట్లు పూర్తిచేయిస్తామని ఎమ్మెల్యే చేస్తున్న ప్రకటనలు ఏ మేరకు సఫలీకృతమవుతాయో వేచిచూడాల్సి ఉందని రైతులు భావిస్తున్నారు.



వైరా కుడికాల్వలో నిర్మించిన గైడ్‌వాల్

లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కుల్ని

హరించిన కేంద్రం

- ప్రపంచ వ్యాప్తంగా ఆరు గంటల పనిదినాలకు కార్యాచరణ
- అహ్మదాబాద్ విమాన మృతులకు సంతాపం
- 21, 22న నిజామాబాద్‌లో టీయూసీఐ రాష్ట్ర మహాసభలు
- విలేకరుల సమావేశంలో టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యం



మాట్లాడుతున్న సూర్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల పాటు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకొచ్చి కార్మికుల హక్కుల్ని కాలరాసిందని టీయూసీఐ(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన ఆధునిక సాంకేతికతతో రోజుకు ఆరు గంటల పనిదినాలకు కార్యాచరణ జరుగుతుండగా దేశంలో మాత్రం 12 గంటల పని దినాలు అమలు జరుగుతున్నాయని అన్నారు. శుక్రవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి రామయ్య అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద మృతులకు సంతాపం ప్రకటించారు. దేశంలో 80 కోట్ల ప్రజలు ఇప్పటికీ ప్రభుత్వ ఉచిత బియ్యంపైనే ఆధారపడి ఉన్నారన్నారు. దారిద్ర్యరేఖకు ఇదే సరైన సమాధానం కాదని ప్రశ్నించారు. కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు ప్రభుత్వాలు పరోక్షంగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్వేష్ మాట్లాడుతూ టీయూసీఐ రాష్ట్ర మహాసభలు 21, 22న నిజామాబాద్‌లో జరుగుతాయని షెడ్యూల్‌ను వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు కొత్తపల్లి రవి, ఆవుల అశోక్, సీహెచ్ పుల్లయ్య, కే శ్రీనివాస్, ములకలపల్లి లక్ష్మీనారాయణ, కంకణాల శ్రీనివాస్, బీ రమేశ్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలి

● కలెక్టర్‌కు తెలంగాణ ఉద్యమకారుల వినతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ఉద్యమకారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని, కానీ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు రాష్ట్రం ఏర్పడిన అనంతరం సరైన గుర్తింపు లభించలేదని పేర్కొన్నారు. ఆరు దశాబ్దాలుగా సాగిన తొలి - మలి తెలంగాణ ఉద్యమంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. 1300 మంది బలిదానాల ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఉద్యమకారుల సంక్షేమానికి సహకరించే వారే లే రని, ఆర్థికంగా చితికిపోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. తక్షణమే తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని , వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అమర వీరుల కుటుంబాలకు పెన్షన్ అందజేయాలని, 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలులో ఉద్యమ కారుల కుటుంబాలకు పెద్ద పీఠం వేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఉద్యమకారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మల్లె రామనాథం, నబీ సాహెబ్, దేవదానం, ఆంజనేయులు, హుస్సేన్, నాగేశ్వరరావు, నాగిరెడ్డి, శ్రావణబోయిన నర్సయ్య, కుచన కృష్ణారావు, కాకెళ్లి సైమన్, వలీబాబా, సత్తార్, బేగ్, లింగయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ'లో కాంట్రాక్టర్లు!



హాజరైన లబ్ధిదారులు

లబ్ధిదారుల కడగండ్లు తొలగించేందుకే: కోరం కనకయ్య, ఇల్లెందు ఎమ్మెల్యే

గతంలో ప్రభుత్వం అమలు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణ పథకాల్లో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవడం, పెట్టుబడులు లేక మెటీరియల్ అందించలేక అనేక అగచాట్లకు గురయ్యేవారు. పేద వర్గాల ప్రజలు పెట్టుబడులకు డబ్బులు లేక అప్పులు చేసేవారు. ఈ క్రమంలో చాలామంది ఇళ్లు నిర్మించుకోలేక పోయేవారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరేది కాదు. ఈ పరిస్థితుల దృష్ట్యా లబ్ధిదారులపై భారం లేకుండా పెట్టుబడులు పెట్టి మంజూరైన తర్వాతనే బిల్లులు పొందేందుకు సిద్ధమైన నిర్మాణ సంస్థలను ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నాం. దీంతో గ్రామాల్లో సిమెంట్, ఇసుక, స్టీల్ కొనుగోలు, సుతార్లు, కూలీల దినసరి కూలీ చెల్లింపులు, తదితర పెట్టుబడులకు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన అవసరం లేకుండా కాంట్రాక్టు సంస్థల వారే నిర్మిస్తారు. అయితే ఇందుకోసం స్వచ్ఛందంగా లబ్ధిదారులు అంగీకరిస్తేనే.. వారి ఇళ్లు కాంట్రాక్టర్లు నిర్మిస్తారు

(5వ పేజీ తరువాయి)

కరెంట్ పైపులు అందించాలని, మరుగుదొడ్లు, స్నానాల గదుల్లో ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ మెటీరియల్, క్యూరింగ్ లాంటి పనుల బాధ్యత లబ్ధిదారులే వహించాలని స్పష్టం చేస్తున్నారు. అదనపు సౌకర్యాలు కల్పించాలంటే అదనంగా పిల్లర్లు, మెట్లు కావాలనుకుంటే లబ్ధిదారులే సొంతంగా డబ్బులు చెల్లించాలని, ప్రభుత్వం నిర్ణయించిన రూ.5లక్షల గృహనిర్మాణ పథకంలో పేర్కొన్న అంశాలనే తాము అమలు చేస్తామని, బిల్లుల కోసం లబ్ధిదారులపై ఎలాంటి ఒత్తిళ్లు చేయమని, తమతో ఒప్పందం కుదుర్చుకుంటే నిర్మాణాలు చేపడతామని కాంట్రాక్టర్లు సమావేశాల్లో పేర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్లాన్‌లో 100 చదరపు అడుగుల హాల్, 130 చదరపు అడుగుల బెడ్‌రూమ్, 70 చదరపు అడుగుల కిచెన్‌లు నిర్మిస్తామని, బాత్‌రూమ్ ఇంటి బయట ఉంటుందన్నారు. కాంట్రాక్టు నిర్మాణ సంస్థలు ఇందిరమ్మ ఇళ్లను రూ.5లక్షల వ్యయంతోనే నిర్మించడానికి సిద్ధపడటం, గృహ నిర్మాణాల సామగ్రి ధరలు రోజురోజుకు పెరిగిపోతున్న సమయంలో లబ్ధిదారులకు కొంత మేర ఊరట కలిగించేలా ఉన్నప్పటికీ.. ఇచ్చిన హామీల మేరకు కాంట్రాక్టర్లు నిర్మాణాలు పూర్తి చేసి ఇళ్లు అప్పగిస్తారా? లేదా? అని లబ్ధిదారులు సంశయం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్దీపకానికి మరిన్ని మెరుగులు!



(5వ పేజీ తరువాయి)

అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా 6, 7 తరగతులకు సైతం ఇవి కొనసాగించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ సూచన మేరకు ఉద్దీపకం-2ను రూపొందిస్తున్నారు. వీటిని విద్యార్థులకు సైతం అందజేయనున్నారు. 60 రోజుల పాటు ఈ ప్రక్రియ సాగనుందని వారు పేర్కొంటున్నారు. ఆరో తరగతిలో 1500 మంది, ఏడో తరగతిలో 2,600 మందికి దీని వలన లబ్ధి చేకూరనుంది.

మెరుగైన విద్య, కెరీర్ గైడెన్స్

ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు కెరీర్ గైడెన్స్‌ను దశలవారీగా అందించేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళిక రూపకల్పన చేశారు. 8, 9, 10వ తరగతులకు చెందిన విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూనే ఏ కోర్సు చేస్తే ఏ విధంగా ఉంటుంది అనేది వివరించనున్నారు.

అలాగే విద్యార్థుల్లో ప్రతిభా పాటవాల ను గుర్తించి వారికి ప్రోత్సాహకాలను కూడా అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో మూడు కొత్త కోర్సులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్13 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ పీజీ కళాశాలలో మూడు కొత్త కోర్సులు తీసుకొచ్చామని ప్రిన్సిపాల్ డాక్టర్ చింత శారద శుక్రవారం తెలిపారు. సింగరేణి సీఎండీ బలరాం నిరంతరం పర్యవేక్షణ , ప్రత్యేక చొరవ, కృషి, సహకారంతో ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ సారథ్యంలో కళాశాలలో మూడు కొత్త కోర్సులని ప్రారంభిస్తున్నట్లుగా పేర్కొన్నారు. కంప్యూటర్ పరిజ్ఞాన ఆధారిత కోర్సులు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి కోర్సుల అందుబాటులో ఉన్నాయన్నారు. సింగరేణి సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల కుమార్తెలు, స్థానిక విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం కండి

(5వ పేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సమష్టిగా కృషిచేయాలని సూచించారు. కష్టపడి పనిచేసే వారికి పదవులు, గౌరవం లభిస్తాయని, సమాజంలో ఆయావర్గాల వారికి అవకాశాలు లభించాలనే బీసీ కులగణన చేపట్టామన్నారు. తద్వారా రాబోయే ఎన్నికల్లో జనాభా నిష్పత్తిలో ఆయావర్గాలకు స్థానిక సంస్థల్లో టికెట్లు, సీట్లు ఇచ్చి గౌరవించడం జరుగుతుందన్నారు. కులగణన చేసి దేశానికి ఆదర్శంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలిచారని, కులగణన జరిపిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు చేపట్టి 536రోజుల్లో 260రోజులు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్నానని, రాష్ట్రంలో ఎక్కడ తిరిగినా ఖమ్మం నియోజకవర్గంలో పర్యటించి వెళుతున్నానన్నారు. ఈ ఏడాది దిన్నరకాలంలో రఘునాథపాలెం మండలానికి రూ.500కోట్లు ఖర్చుచేశామన్నారు. పంచాయతీలను ఏకగ్రీవంగా గెలిపిస్తే అక్కడ రూ.10లక్షలు అభివృద్ధికి ప్రభుత్వంనుంచి మంజూరుచేయిస్తానని ప్రకటించారు. ఈసమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగులసంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ మార్కెట్ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దీప్లానాయక్, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మండల సమన్వయ కమిటీ సభ్యులు, మంత్రి తుమ్మల చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మండల సమన్వయ కమిటీ నాయకులు రఘునాథపాలెం మండలంలో ఉన్న 37పంచాయతీలను కాంగ్రెస్ గెలిచేలా కృషిచేస్తామని ప్రకటించారు.



ఈనెల 25లోపు రైతుభరోసా..

వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున ఈనెల 25లోపు రైతులందరికీ రైతుభరోసా అందిస్తామని, ఇందుకోసం ఎకరానికి రూ.6వేల చొప్పున రూ.10వేల కోట్లు అందించబోతున్నామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రెండేళ్ల పాటు పనిచేసి అర్హత ఉన్న వ్యవసాయకూలీలకు కూడా సాయం అందిస్తామన్నారు. కల్తీవిత్తనాలు, అనుమతిలేని విత్తనాలు ఎవరైనా అమ్మితే వారిపై పీడీయాక్టు కింద కఠిన కేసులు పెట్టాలని ఆదేశించామని, రాష్ట్రంలో అన్నిజిల్లాల్లో టాస్క్‌ఫోర్సు బృందాలు అనుమతిలేని విత్తనాలపై నిఘాపెట్టాయన్నారు. పామాయిల్‌కు కనీస మద్దతు ధర ఏర్పాటు చేయాలని త్వరలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక తదితర రాష్ట్రాల రైతుల ఆధ్వర్యంలో ప్రధానమంత్రిని కలుస్తామన్నారు. ఇప్పటికే ప్రధానికి సీఎం రేవంత్‌రెడ్డికూడా ఆయిల్ పామ్‌కు కనీస మద్దతు ధరకావాలని, విదేశాల నుంచి పామాయిల్ దిగుమతిపై కొంత నియంత్రణ ఉండాలని లేఖ రాశారన్నారు. కొణిజర్లలో గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పరిశ్రమతోపాటు రిఫైన్డ్ ఆయిల్‌తయారీ, సీడ్ గార్డెన్ కూడా ఏర్పాటు చేయబోతున్నామని, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ పరిశ్రమ ద్వారా కూడా రిఫైన్డ్ ఆయిల్ పరిశ్రమలు ఏర్పాటుచేయబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో 2.50లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగవుతోందని, ఈఏడాది 1.40లక్షల ఎకరాలు రైతులు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఏటా లక్ష ఎకరాల్లో పెంచాలన్నదే ప్రభుత్వ విధానమన్నారు. దేశంలో వరి, పామాయిల్ సాగులో తెలంగాణ రాష్ట్రం ముందుందని తెలిపారు. దేశంలో తొలిసారిగా కొణిజర్లలో పామాయిల్ సీడ్‌గార్డెన్ ఏర్పాటవుతుందని ప్రస్తుతం విదేశాల నుంచి పామాయిల్ విత్తనాలు దిగుమతి చేసుకుంటున్నామన్నారు. కాళేశ్వరం కోసం ఆనాటి ప్రభుత్వం సబ్‌కమిటీ వేయలేదని రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రాణహిత, దుమ్ముగూడెం, రుద్రంకోట లాంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన సూచనల కోసం సబ్ కమిటీ ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల వివరించారు. గతంలో దుమ్ముగూడెం, రుద్రంకోట రెండు వేర్వేరుగా ఉన్న ప్రాజెక్టులను ఈ సబ్ కమిటీలో చర్చించి రుద్రంకోట ఏపీలోకి వెళ్లినందున దుమ్ముగూడెం ప్రాజెక్టునే సీతారామప్రాజెక్టుగా రూపకల్పన చేశామని, వైల్డ్‌లైఫ్ ఫారెస్టు ఉన్నందున అనుమతి రాకపోవడంతో అక్కడ డిజైన్ మార్చడం జరిగిందని తెలిపారు.

నేడు సత్తుపల్లిలో బత్తుల జీవన రేఖలు పుస్తకావిష్కరణ

సత్తుపల్లిరూరల్, జూన్13 (ఆంధ్రజ్యోతి): వీర తెలంగాణ నక్సల్బరీ శ్రీకాకుళ రైతాంగ పోరాటాలతో ఉత్తేజితమైన ఖమ్మంజిల్లాలో న్యాయవాద వృత్తిని వదిలి ప్రజా న్యాయంకోసం అమరుడైన తొలి విప్లవకారుడు బత్తుల వెంకటేశ్వరరావు జీవన రేఖలు పుస్తకావిష్కరణ నేడు సత్తుపల్లిలో జరుగనుంది. ఈ సందర్భంగా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఈ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు బీవీఎంటీ గ్రంథాలయం బాధ్యులు కూకలకుంట రవి శుక్రవారం తెలిపారు. నక్సల్బరీ మేఘగర్జనతో తెలంగాణ మాగాణంలో పులకించి తొలకరి జల్లులు కురిపించి తొలిపొద్దు సూర్యుడై అస్తమించిన కామ్రేడ్ బత్తుల నమ్మిన విప్లవ ఆశయాలకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో... సమాజాన్ని చైతన్యపరచాలనే ఆశయంతో సత్తుపల్లిలో 1983 మే 8వ తేదీన బత్తుల వెంకటేశ్వరరావు మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సామాజిక అంశాలపై ఉపన్యాసాలు, దాతల సహకారంతో ఎన్నో దిన, వార, పక్ష, మాస పత్రికలను తెప్పించి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. అంతేకాకుండా నేటి భారతం పుస్తక పునఃముద్రణ ప్రచురణతో పాటు రెండు సంస్మరణ సంచికలు విడుదల చేశామన్నారు. ఈ చారిత్రాత్మక పుస్తకావిష్కరణ సభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పుస్తకావిష్కరణకు ముస్తాబైన బీవీఎంటీ గ్రంథాలయం

సింగరేణి వర్సెస్ మునిసిపల్ కార్పొరేషన్

కొత్తగూడెం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం.... మున్సిపల్ కార్పొరేషన్ మధ్య భూ వివాదం ఏర్పడింది. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పక్కన రిటైల్ కూరగాయల మార్కెట్ నిర్మించేందుకు మునిసిపల్ అధికారులు సన్నద్ధమయ్యారు. నిర్మాణ పనులను సింగరేణి సెక్యూరిటీ అధికారులు శుక్రవారం అడ్డుకోవడంతో చిరువ్యాపారులు, సింగరేణి సెక్యూరిటీ, ఎస్టేట్ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. కొత్తగూడెం మునిసిపాలిటీ పరిధిలోని రైతుబజారు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో గత ఏడాది సెప్టెంబర్ నెలలో రూ.50లక్షల డిస్ట్రిక్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నిధులతో రిటైల్ కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కూనంనేని శంకుస్థాపన చేశారు. గత రెండు రోజుల క్రితం రిటైల్ కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులకు సంబంధించి అధికారులు భూమిని శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. శుక్రవారం నిర్మాణ పనులను చేపడుతుండగా సింగరేణి అధికారులు వచ్చి పనులను అడ్డుకోవడంతో వివాదం ముదిరింది. దీంతో వారి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సింగరేణి స్థలంలో నిర్మాణాలను నిలిపివేయాలంటూ సంబంధిత అధికారులు పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేస్తే సింగరేణి అధికారులు అడ్డుకోవడం ఏమిటంటూ చిరువ్యాపారుల సంఘం నాయకులు సింగరేణి అధికారులను నిలదీశారు. ఇద్దరి మధ్య వివాదం చెలరేగడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను శాంతింపచేశారు. రిటైల్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి నిధుల మంజూరు తదితర అంశాలపై వివరణ కోరేందుకు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్టుచేయలేదు.

సింగరేణి స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు

సింగరేణి ఎస్టేట్ జీఎం నరజాల రామకృష్ణ

సింగరేణి భూములు ఆక్రమణకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. మునిసిపల్ పరిధిలో 10 ఎకరాల భూమిలో మల్టీకాంప్లెక్స్‌ను నిర్మించేందుకు యాజమాన్యం ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. సింగరేణిలో విలువైన స్థలాలను అప్పచెప్పలేదు. ఆస్తులను కాపాడుకునేందుకు ఎస్టేట్ విభాగం కృషి చేస్తోంది.


సింగరేణి సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన చిరు వ్యాపారులు

ఆర్యవైశ్యుల భవన నిర్మాణానికి

స్థలం కేటాయించాలని వినతి


మంత్రి తుమ్మలకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఖమ్మం వ్యవసాయం, జూన్13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జిల్లా ఆఫీసు నిర్మాణం కోసం ప్రభుత్వపరంగా 2000 గజాల స్థలం కేటాయించవలసిందిగా ఖమ్మం నియోజకవర్గ శాసనసభ సభ్యులు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు శుక్రవారం ఆ సంఘ సభ్యులు వినతి పత్రం అందించారు. ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, మాజీ అధ్యక్షుడు వనమా వేణుగోపాలరావు (సూరి), ప్రధాన కార్యదర్శులు వనమా కిరణ్ కుమార్, గోళ్ళ రాధాకృష్ణమూర్తి, వనమా విశ్వేశ్వరరావు, నూకల శ్రీనివాసరావు, కన్యకా పరమేశ్వరి దేవాలయం అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, గుమ్మడవెల్లి శ్రీనివాసరావు, పొల్సాయి వెంకటేశ్వరరావు, చారుగుండ్ల వెంకట లక్ష్మి నరసింహారావు, పొల్సాయి సీతయ్య, కొప్పరపు బలరాం, పసుమర్తి లక్ష్మణరావు, వసుమర్తి రాంబాబు, చలవాది నగేష్, దోసపాటి శ్రీనివాసరావు, అనుమోలు శ్రీనివాసరావు, తల్లాడ రమేష్, కల్వకుంట్ల గోపాల్ రావు, రాయపూడి రవికుమార్, తదితరులున్నారు.

జూలై 12న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డిగ్రీ పాసైన అభ్యర్థులకు సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష 2026 కోసం జూలై 12న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి ఉచిత శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత కోచింగ్ తరగతులు జూలై 25 నుంచి 2026 ఏప్రిల్ 30 వరకు బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 150 అభ్యర్థులకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. వీరిలో 100 మందిని జూలై 12న నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మరో 50 మంది అభ్యర్థులను గతంలో సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ధ్రువపత్రాలతో టీజీ బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో ఈ నెల 16 నుంచి జూలై 8లోగా దరఖాస్తులు అందించిన వారినే ఎంపిక చేయడం జరుగుతుందని ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ. శ్రీలత తెలిపారు. వివరాలకు 9573859598, 9441931359 నెంబర్లను లేదా నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని తెలిపారు.

పెద్దకోరుకొండి చేపల సొసైటీలో

రాజకీయ జోక్యం

- వివాదంగా మారిన సభ్యత్వ నమోదు ప్రక్రియ
- సభ్యుల నమోదుపై హైకోర్టును ఆశ్రయించిన ఓ వర్గం


సభ్యత్వం కోసం డిమాండు చేస్తున్న ఓ వర్గం

కల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో కొత్త సభ్యుల నమోదు అంశం రెండు వర్గాల మధ్య వివాదంగా మారింది. మరోవైపు సభ్యుల నమోదు విషయంలో ప్రధానంగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు రాజకీయ నాయకులు రంగ ప్రవేశం, అధిపత్య పోరుతో ఈ వివాదం మరింత ముదిరింది.

పెద్దకోరుకొండి గ్రామంలో మత్స్యపారిశ్రామిక సంఘం 1980లో 115 మంది సభ్యులతో ఏర్పడింది. ఈ సొసైటీ క్రమేపి కొనసాగుతూ వస్తూ 2017లో 98 జీవో వ్యతిరేకంగా కొత్త సభ్యులు నమోదుపై ఆనాటి అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతోనాటి అధికార పార్టీ వర్గం తరుపున 190 మంది కొత్త సభ్యులను చేర్పించారు. దీంతో కొత్త, పాత సభ్యుల మధ్య వివాదం రగిలింది. ఇలా ప్రధానంగా రెండు పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు తమ అధిపత్యం కోసం ఈ సొసైటీలో కొత్త సభ్యుల నమోదు వెనుక రంగ ప్రవేశం చేయడంతో చివరకు రాజకీయంగా మారింది.

హైకోర్టును ఆశ్రయించిన పాత సభ్యులు

పెద్దకోరుకొండి మత్స్య సహకార సంఘం పరిధిలో కొత్త, పాత సభ్యుల మధ్య ఏర్పడిన వివాదం రగలి అంతిమంగా పాత సభ్యులు (కొత్త సభ్యుల నమోదుపై) 2018లోనే హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాల ప్రకారం కొత్త సభ్యులను చేర్పించడంలో గల కారణాలు తెలపాలని హైకోర్టు 2020లో అధికారులను కోరింది. దీనిపై పాత సభ్యులతో(70) మందితో ఎన్నికలు నోటిఫికేషన్ ఇచ్చారు. అందుకు భిన్నంగా మరో వర్గం అధిపత్యంతో మత్స్యపారిశ్రామిక శాఖ అధికారులు 70 మంది పాత సభ్యులు, 190 కొత్త సభ్యులు కలిపి 250 మంది సభ్యుల జాబితాతో కలిపి 2023 నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ సమయంలో కొత్త, పాత సభ్యుల మధ్య శాంతి భద్రతలకు భగం కలుగుతుందని భావించి పాత సభ్యుల వర్గం తరుపున హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఎన్నికలు నిలిచి పోయాయి. ప్రస్తుతం ఈ వివాదం కోర్టు పరిధిలోనే ఉంది.

పాత సభ్యుల సమావేశం..

పెద్దకోరుకొండి మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం పరిధిలో గల పాత సభ్యుల సమక్షంలో శుక్రవారం మరో విడతగా సమావేశం ఏర్పాటు చేశారు. మత్స్య సహకారం సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మరసకట్ల బాలరాజు (శౌరి) సమక్షంలో కొత్తగా సభ్యుల నమోదు రద్దు చేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు. ఇలా కొత్త, పాత సభ్యుల మధ్య వివాదంతో 2017 నుంచి ఎన్నికలు జరగకుండా నిలిచి పోయాయి. ఈ క్రమంలో పాత సభ్యులైన 115 మందిలో వృద్ధులు, అనారోగ్యంతో కొందరు మృతి చెందడంతో ఆ జాబితాలో 70 మంది (పాత సభ్యులు) మాత్రమే మిగిలినారు. మరో వర్గానికి చెందిన 190 మందిని చేర్చుకోవద్దని పాత సభ్యులు అభ్యంతర వ్యక్తం చేస్తున్నారు. ఇలా అన్ని అర్హతలు ఉన్న తమకు కొత్తగా సభ్యులుగా చేర్పించుకోవాలని మరో వర్గం వారి వాదన. అంతిమంగా పెద్దకోరుకొండి మత్స్యసహకార సంఘం ఎన్నికలు కొత్త, పాత సభ్యుల మధ్య వివాదం, రాజకీయనాయలు అధ్యిపత్య పోరు రెండు వర్గాల తరుపున తెరవెనుక ఉండి రాజకీయం నడుపుతుండటంతో వివాదానికి దారి తీసింది.

కుమార్తెను ప్రభుత్వ బడిలో చేర్పించిన హెచ్‌ఎం


ప్రభుత్వ బడిలో చేరిన చిన్నారి

దుమ్ముగూడెం జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట ఆశ్రమ హైస్కూలు హెచ్‌ఎం కుంజా శ్రీనివాసరావు తన కుమార్తె ద్రాక్షిణ్యను ప్రైమరీ విభాగం ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతిలో చేర్చారు. ద్రాక్షిణ్య మూడవ తరగతి వరకు భద్రాచలంలోని ఓ ప్రైవేటు కాన్వెంటులో చదివింది. గత విద్యాసంవత్సరంలో ఈ పాఠశాలలో ఆటపాటలతో చదువు చెప్పడం, బోధనా విధానం, భోజన వసతిలకు ఆకర్షితురాలైన ద్రాక్షిణ్య ఇక్కడే చదువుతానని తల్లిదండ్రులను ఒప్పించి చేరింది. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు సైతం భద్రాచలం నుంచి నారాయణరావుపేటకు పూర్తిగా మకాం మార్చారు. టీచర్లు సర్వేశ్వరావు, నాగభూషణం, కోటేశ్వరావు, వెంకటేష్, మల్లయ్య, వీరయ్య తదితరులు నూతనంగా చేరిన విద్యార్థులకు బొకేలు ఇచ్చి స్వాగతం పలికారు.

విద్యార్థులే.. స్వీపర్లు..!

- నిబంధనలు మరిచిన మంగపేట పాఠశాల ఉపాధ్యాయులు

ములకలపల్లి , జూన్ 13(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేసేందుకు స్వీపర్లు లేకపోవడం.. గ్రామపంచాయతీ కార్మికులు కూడా పట్టించుకోకపోవడంతో.. ముల్కలపల్లి మండలం మంగపేట గిరిజన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులే స్వీపర్లుగా మారారు. శుక్రవారం ఆ పాఠశాలను విద్యార్థులే శుభ్రం చేయడం కలకలం రేపింది. అసలు చిన్నారులతో పనులు చేయించొద్దని నిబంధనలు ఉన్నా వాటిని పక్కన పెట్టిన ఆ పాఠశాల ఉపాధ్యయులు విద్యార్థులతో పనులు చేయించడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. ఈపాఠశాలలో ఇలావిద్యార్థులతో పారిశుధ్య పనులు చేయించటం కొత్తేమీ కాదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై కమలాపురం కాంప్లెక్సు హెచ్‌ఎం బుచ్చి రాములను వివరణ కోరగా పాఠశాలకు స్వీపర్లు లేరని, అయినా విద్యార్థులతో శుభ్రం చేయించడం సరికాదని, ఈఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.


మంగపేట పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

బ్యాటరీల దొంగ అరెస్ట్

అశ్వారావుపేటరూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బ్యాటరీలను దొంగిలించిన వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అరెస్ట్ వివరాలను ఎస్‌ఐ యయాతిరాజు తెలిపారు. ఆంధ్రాలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం గ్రామానికి వేముల కిషోర్ అనే ఆటో డ్రైవర్ మండలంలోని వినాయకపురంలో డోజర్ ట్రాక్టర్ బ్యాటరీ, ఆటో బ్యాటరీలను దొంగిలించి జంగారెడ్డిగూడెం తరలిస్తున్నాడు. అశ్వారావుపేటలో శుక్రవారం మధ్యాహ్నం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా చోరీ విషయం తెలిసింది. దీంతో స్టేషన్‌కు తరలించి బ్యాటరీలను, ఆటోను స్వాధీనం చేసుకుని నిందితుడు కిషోర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ యయాతిరాజు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్ట్

పినపాక, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ. కొత్తగూడెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఏడూళ్లబయ్యారం పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించి ఏడూళ్లబయ్యారం ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, టీ.కొత్తగూడెం గ్రామ శివారుల్లో పేకాటాడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వరరావుల ఆదేశాల మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో నలుగురు వ్యక్తులు పారిపోయారని తెలిపారు. దాడిలో రూ.5100 నగదు, 5 బైకులు, అదుపులోకి తీసుకుని, 8 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గేదె మృత్యువాత

దుమ్ముగూడెం జూన్13 (ఆంధ్రజ్యోతి):తూరుబాక ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై గురువారం రాత్రి చర్ల నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక గేదె మృతి చెందగా మరో గేదెకు కాళ్లు విరిగాయి. రెండు గేదెలు తూరుబాకకు చెందిన రైతు కందుల వెంకటనర్సయ్యకు చెందినవి కాగా శుక్రవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతిచెందిన గేదె విలువ రూ1లక్షలు కాగా, కాళ్లు విరిగిన గేదె విలువ రూ70వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

కారు బోల్తా: వ్యక్తికి గాయాలు

జూలూరుపాడు,జూన్13(ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి బోల్తాపడటంతో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం జూలూరుపాడులోని పోలీస్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. పాల్వంచకు చెందిన శివప్రసాద్ ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో జూలూరుపాడులోని పోలీస్‌స్టేషన్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. రహదారిపై బోల్తా పడింది. కారులోని ఎయిర్‌బ్యాగులు ఓపెన్ కావడంతో పెనుప్రమాదం తప్పింది. శివప్రసాద్‌కు గాయాలు కావడంతో పోలీసులు ప్రైవేటు వాహనంలో ఆయన్ను కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు.

మెనూ అమలుపై శిక్షణ

కొత్తగూడెంఅర్బన్, జూన్13(ఆంధ్రజ్యోతి):పాఠశాలల్లో మధ్యాహ్న భోజన మెనూను పకడ్బందీగా అమలు చేయాలని డీఈవో వెంకటేశ్వరచారి అన్నారు. శుక్రవారం జిల్లావిద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన మెనూ అమలుపై కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, కార్మికులకు శిక్షణ ఏర్పాటుచేశారు. వంటవార్పులో సరైన శిక్షణ లేక చిన్నచిన్న పొరపాట్లతో పోషకాలు అందకుండా పోతున్నాయని గుర్తించిన ప్రభుత్వం వంట శుభ్రత, వడ్డన తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామన్నారు.శిక్షణ పొందినవారంతా కాంప్లెక్స్ స్థాయిలో పాఠశాలల కార్మికులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్లు నాగరాజ శేఖర్, ఎస్‌కే. సైదులు, ఎస్. సతీష్‌కుమార్, ఎఫ్ఏవో శ్రీనివాసరావు, జిల్లా రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ.. ఉపాధికి దారి

- ఇసుక లారీలకు పట్టాలు కట్టటంతో దండీగా ఆదాయం
- రోజుకు ఒక్కరికి రూ.3వేల వరకు సగటు కూలీ
- సభ్యత్వం ఉన్న వారికి బోనస్ రూపంలో ఆదాయం


పనులకు వచ్చిన కూలీలు

చర్ల,జూన్13(ఆంధ్రజ్యోతి):పనులు లేక పస్తులుంటున్న సమయంలో ఇసుక ర్యాంపులు స్థానికులకు వరంగా మారాయి. ఇసుక లోడింగ్ తరువాత లారీలకు పట్టాలు కట్టి వందల మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. అంతేకాక ఇసుక క్వారీల్లో సభ్యత్వం ఉన్న వారికి బోనస్ రూపంలో అదనపు ఆదాయం వస్తోంది. ఒక్క చర్ల మండలం సీకత్తిగూడెం క్వారీలో సుమారు రూ.8కోట్ల ఆదాయం గిరిజనులకు వచ్చింది. రెండు రూపాల్లో నగదు వస్తుండంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని క్వారీల్లో నిత్యం పనులు దొరుకుతుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నిత్యం ఉపాధి దొరుకుతుందంటున్నారు.

పట్టాలు కట్టి ఉపాధి..

చర్ల మండలంలో ప్రస్తుతం నాలుగు ఇసుక క్వారీలు నడుస్తున్నాయి. ప్రతీ రోజులు పదుల సంఖ్యలో లారీలు క్వారీలకు వస్తున్నాయి. దీంతో క్వారీలకు సమీపంలోని స్థానికులు అక్కడ పనులు చేసేందుకు రోజుకు ఒక టీం చొప్పున పనులు పంచుకుంటున్నారు. క్వారీలకు వచ్చిన లారీల్లో ఇసుక నింపిన తరువాత పట్టా కడుతున్నారు. ఇసుక సరియేయటం, దానిపై తారుబాల్ కట్టడం లాంటి పనులు చేస్తున్నారు. ఇలా కట్టినందుకు ప్రతీ లారీకి రూ.వెయ్యి తీసుకుంటున్నారు. లారీల సంఖ్యను బట్టి ప్రతీ రోజు వెయ్యి నుంచి రూ.3వేల ఆదాయం పొందుతున్నారు. గతేడాది చర్ల మండలం సీకత్తిగూడెం ర్యాంపులో డీసిల్టేషన్ పేరుతో 9లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను టీఎస్ఎండీసీ అధికారులు అమ్మకాలు జరిపారు. సుమారు 54వేలలారీలు క్వారీకి వచ్చాయని అధికారులు తెలిపారు. లారీలకు పట్టాలు కట్టి సుమారు రూ.5.50కోట్ల ఆదాయాన్ని అక్కడి కూలీలు పొందారు. దీనికి తోడు క్వారీల్లో సభ్యులుగా ఉన్న 172మంది కుటుంబాలు రూ.2.50 లక్షల ఆదాయం పొందారు. మొత్తంగా ఈక్వారీ ద్వారా గిరిజనులకు రూ.8కోట్ల ఆదాయం సమకూరింది.

పనులు దొరుకుతుండంతో హర్షం..

నిత్యం కూలీలకు పనులు దొరుకుతుండంతో స్థానిక కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చిన తరువాత ఇసుక క్వారీలు మంజూరు చేసి పనులు కల్పించారని చెబుతున్నారు. అలాగే ఒక్క చర్ల మండలంలోనే పట్టాలు కట్టే పనుల్లో సుమారు 5వేల మంది కూలీలు పాల్గొంటున్నారు. యువత, పిల్లలకు కూడా ఈ పనులకు వెళుతున్నారు. రెండు షిఫ్టులుగా పనులు చేస్తున్నారు. భారీ సంఖ్యలో స్థానికులు పట్టా కట్టే కనులకు వెళ్తుండడంతో గోదావరి తీరం సందడిగా కనిపిస్తోంది. అలాగే సీకత్తి గూడెం క్వారీ ద్వారా రూ.54కోట్ల ఆదాయం వచ్చినట్లు టీఎస్ఎండీసీ అధికారులు చెబుతున్నారు. దానికి తోడు ఓవర్ లోడ్ లేకుండా, క్వారీలు సజావుగా నడిచేందుకు భద్రాద్రి కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, స్థానిక సీఐ రాజువర్మ, టీఎస్ఎండీసీ పీవో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

12మంది రిమాండ్‌కు తరలింపు



భద్రాచలం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఏఎస్ఆర్ కాలనీలో ఇటీవల జరిగిన కణితి సతీష్ హత్య కేసులో 12 మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భద్రాచలం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. హత్య కేసులో ప్రధాన నిందితుడైన గుంజా సాయిరాంను గతంలోనే అరెస్ట్ చేశామన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి 12 మందిని పట్టుకోవడం జరిగిందని, మిగిలిన నిందితుల కోసం పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మూగ్గం మోహినుద్దీన్, సారపాక రాజీవ్‌నగర్‌కు చెందిన మోతుకూరి సాయి(అలియాస్ సారపాక సాయి), చల్లా అజయ్, భద్రాచలం జగదీష్ కాలనీకి చెందిన వల్లెపు సాంబ, వల్లెపు దుర్గాప్రసాద్, గుంజా గోపిచంద్, గుంజా వెంకటేష్, గోళ్ల గణేష్, దిగువ భద్రాచలానికి చెందిన మోతుపల్లి కామేష్, ఏటపాక మండలం చెన్నంపేట గ్రామానికి చెందిన గుండి రాకేష్, శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన బానోత్ మధు,అశోక్ నగర్ కొత్తకాలనీకి చెందిన చెంచలపు రాహుల్ తేజ(అలియాస్ రాహుల్) లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

మద్యం మత్తులో మిత్రుడిపై దాడి

కల్లూరు,జూన్13(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని కల్లూరులోని తిరువూరు క్రాస్ రోడ్ వద్ద శుక్రవారం మద్యం మత్తులో ఓ మిత్రుడు తోటి మిత్రుడిపై కోడికత్తితో దాడి చేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. నారాయణపురం గ్రామానికి చెందిన రాజు, మిత్రుడైన మేక రవిలు కలిసి మధ్యాహ్నం ఓ వైన్స్ షాపులో మద్యం తాగారు. మద్యం మత్తులో వారిద్దరు గొడవకు దిగారు. మాటామాట పెరిగి దాడికి దారితీసింది. ఈసమయంలో రాజు అనే యవకుడు మేక రవిపై కోడికత్తితో దాడి చేశాడు. దీంతో మెడ భాగంలో తీవ్రమైన గాయమైంది.ఈసంఘటనపై సమాచారం అందుకున్న రవి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిసింది.

రుణమాఫీ, రైతుభరోసాపై ఫ్లెక్సీలు

ప్రతీ గ్రామంలో ఏర్పాటుకు చర్యలు

పథకాల ప్రయోజనాలు, లబ్ధిపొందిన వారి వివరాలు ముద్రణ

భద్రాద్రి జిల్లాలో 20,610ఫ్లెక్సీలకు రూ.72.13లక్షల నిధులు

ఖమ్మం జిల్లాలో 11,235 ఫ్లెక్సీలకు, రూ .39.32 లక్షల కేటాయింపు

కొత్తగూడెంఅర్బన్/ఖమ్మం వ్యవసాయం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణ మాఫీ, రైతుభరోసా పథకాలపై అవగాహన, ఆయా పథకాలతో జరిగే ప్రయోజనాలు, ఇప్పటి వరకు లబ్ధి పొందిన వారి వివరాలతో గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు భద్రాద్రి జిల్లాలో 20,610ఫెక్సీలు ఏర్పాటు చేసేందుకు గాను రూ.72.13లక్షల నిధులను వ్యవసాయ శాఖ ద్వారా నిధులను మంజూరు చేసింది. గ్రామానికి మూడు చొప్పున ఒక్కో ఫ్లెక్సీకి రూ.350 వెచ్చించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రూ.2క్షల లోపు రుణమాఫీ పథకం కింద లబ్ధిపొందిన జిల్లాలోని మొత్తం 61,409మంది రైతుల వివరాలతో 5,238 ఫ్లెక్సీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ఫ్లెక్సీల కోసం రూ.18.33లక్షలు వెచ్చించనున్నారు. ఇక రైతు భరోసా లబ్ధిదారుల వివరాలతో మొత్తం 20,610ఫ్లెక్సీల ఏర్పాటుకు రూ. 72.13 లక్షలు విడుదల చేసింది. శనివారం జిల్లావ్యాప్తంగా ఈఫ్లెక్సీల ప్రదర్శన జరగనుంది.

ఖమ్మం జిల్లాలో ఫ్లెక్సీల కోసం రూ.39,32,215 నిధులు కేటాయించారు. మొత్తం 11,235 ఫ్లెక్సీలను జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గిరిజన పల్లెల్లో మలేరియా

- రెడ్డిగూడెంలో గిరిజనుడి మృతి
- ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసిన అధికారులు

అశ్వారావుపేటరూరల్, జూన్13(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో మండలంలో జ్వరాల విజృంభణ ఆరంభమైంది. సాధారణ జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్ అధికంగా ప్రబలుతున్నాయి. మండలంలోని రెడ్డిగూడెం, బండారుగుంపు, గ్రామాల్లో అనేక మంది జ్వరాలతో బాధపడుతున్నారు. వ్యాధుల సీజన్ ఆరంభంకావటంతో గిరిజనుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. జ్వరాలతో ఏటా అనేకమంది మరణిస్తూనే ఉన్నారు. రానున్న కాలంలో జ్వరాలు మరింతగా ప్రభలే అవకాశం ఉండటం, వ్యాధుల సీజన్ ఆరంభంకావటంతో మండలంలోని రెడ్డిగూడెంలో చిన వెంకటరెడ్డి(40) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆయన జ్వరంతో బాధపడుతున్నాడు. వినాయకపురం పీహెచ్‌సీలో గురువారం పరీక్షలు నిర్వహించారు. రక్తకణాలు సంఖ్య పడిపోయినట్లు సిబ్బంది గుర్తించి ఖమ్మం వెళ్లాలని సూచించారు. వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు సత్తుపల్లి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గ్రామంలో ఇప్పటికే మరో రెండు మలేరియా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి.

ఈ నేపథ్యంలో శుక్రవారం వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యులు రాందాస్ నాయక్ 30 మందికి వివిధ రకాల పరీక్షలు చేయగా ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నట్లుగా గుర్తించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. ఇంటింటి సర్వేను చేపట్టి దోమల నివారణ చర్యలు చేపట్టారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు.కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గోపాల్, ప్రసాద్, ఏఎన్ఎం నాంచారి, ఎంటీఎస్ విజయరెడ్డి, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రేపట్నుంచి పెవిలియన్ గ్రౌండ్‌లో ఉచిత యోగా శిక్షణ

ఖమ్మంస్పోర్ట్స్, జూన్13(ఆంధ్రజ్యోతి): ఈనెల21 అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నుంచి నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు వర్తమాన్ యోగా(పాదం యోగా) ప్రతినిధులు సంధ్య, సమత, అమూల్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల21 వరకు నిర్వహించే ఈ క్యాంపును ఆరోగ్యాభిలాషులు సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల ఔత్సాహికులు ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించే యోగా సాధన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్యశిబిరం పరిశీలిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్, జూన్13 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయ కుడు తుంబూరి దయాకర్‌రెడ్డి సూచిం చారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధి లోని పెద్దతండాలో పీఎస్ఆర్ ట్రస్ట్ సౌజ న్యంతో ఏదులాపురం మునిసిపల్ కార్యా లయం ఎదుట శుక్రవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబి రాన్ని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. సుమారు 3 వందల మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మున్నేరు బీమాకు 'ధ్రువీకరణ' కష్టాలు

- అద్దెకు ఉండేవారికి అంగీకారపత్రం ఇవ్వని భవన యజమానులు
- మున్నేరు పరివాహక ప్రాంతంలో 5వేలకు పైగా కుటుంబాల నివాసం
- కేఎంసీ నుంచి ధ్రువీకరణ ఇస్తేనే బీమాకు అవకాశం అంటున్న బ్యాంకర్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 13(ఆంధ్ర జ్యోతి): మున్నేరు ముంపు బాధితులకు బీమా సౌకర్యంపై కల్పించటంపై ఇంటి యజమా నుల నుంచి సమస్యలు తలెత్తుతున్నాయి. వరద సమయంలో ప్రజలు ధీమాగా ఉండేలా ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభి షేక్ అగస్త్య కార్యచరణ చేశారు. కానీ మున్నేరు పరివాహక ప్రాంతంలోని అద్దెకు నివాసం ఉంటున్న వారికే బీమా ప్రీమియంపై సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. ఒక నివా సాన్ని యూనిట్‌గా తీసుకొని బీమా ప్రీమియం తీసుకుంటే నివాసంతో పాటుగా విద్యుత్ పరికరాలు, గృహోపకరణాల వరకు బీమా వర్తింపు జరుగుతుందని కంపెనీలు భరోసా కల్పిస్తున్నారు. కాగా ఆ నివాసంలో యజమానితో పాటుగా అద్దెకు ఉండే వారికి బీమా వర్తింపుపై పీటముడి ఏర్పడింది.

బీమాపై పీటముడి

మున్నేరు పరివాహక ప్రాంతంలో 16, 17, 28, 29, 30, 34, 35,46, 47, 48, 59, 60 డివి జన్లు వ్యాపించాయి. ముంపుకు గురై నివా సాలు 15వేల వరకు ఉన్నాయి. గత ముంపు సమయంలో 10వేల వరద బాధిత కుటుంబా లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.16,500 చొప్పున పరి హారం కూడా చెల్లించింది. ఈ సమయంలో నివాసాల యజమానులకు పరిహారం అందు తుండగా అద్దెకు ఉంటున్న వారిని గుర్తించ టంలో ఇబ్బందులు ఎదురైతున్నాయి. ఇప్పటికి పరిహారం అందని వారిలో అద్దెకు ఉన్న బాధి తులే అధికంగా ఉన్నారు.

కేఎంసీ చొరవ తీసుకుంటేనే

ముందస్తుగా బీమా ప్రీమియం తీసుకో వటం ద్వారా మున్నేరు పరివాహక ప్రాంతంలో ఆస్తినష్టం తగ్గించాలని కార్యచ రణ చేసిన కేఎంసీ అధికారులకు బీమా కంపె నీలు నివాస ధ్రువీకరణ విషయంపై అభ్యంత రాలు వ్యక్తం చేశారు. ఇంటియజమాని ప్రాంశ రీనోట్‌పై అద్దెకు ఉంటున్న వారితో అంగీకర పత్రం ఇవ్వాలని బీమా కంపెనీలు సూచిం చాయి. అయితే అందుకు నివాసాల యజమా నులు అంగీకరించకపోవటంతో పీటముడి పడింది. అయితే కేఎంసీ వార్డు ఆఫీసర్లు, మెప్మా బృందాలు ఇంటింటి సర్వే చేపట్టి, నివా సాల యజమానులతో పాటుగా అద్దెకు ఉంటున్న వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి, వారికి నివాస ధ్రువీకరణ పత్రాలు అందిస్తే కొంతమేరా బీమా కంపె నీలు ప్రీమియం చెల్లించుకునేందుకు అవ కాశం ఉంటుందని కొంతమంది బ్యాంకర్లు సూచనలు చేస్తున్నారు.


మున్నేరు వరద ముంపుకు గురైన బొక్కలగడ్డ ప్రాంతం

గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్13 (ఆంధ్రజ్యోతి): జూలై 10న బుద్ధ పౌర్ణిమ సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, మణు గురు, సత్తుపల్లి డిపోల నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు రీజనల్ మేనేజర్ సరిరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మణుగురు నుంచి జూలై8న సాయంత్రం6గంటలకు, ఖమ్మం లో, సత్తుపల్లిలో7గంటలకు బస్సులు బయ లుదేరుతాయని తెలిపారు. కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం జూలై 10వ తేదీన అరుణాచలంలో గిరిప్రదక్షణ అనంతరం సాయంత్రం తిరుగు ప్రయాణం ఉంటుందని తెలిపారు. మణు గురు నుంచి పెద్దలకు రూ. 5,500లు, పిల్ల లకు రూ. 2750 గా, సత్తుపల్లి నుంచి పెద్ద లకు రూ.5000, పిల్లలకు రూ.2500, ఖమ్మం నుంచి పెద్దలకు 5000, పిల్లలకు 2500గా చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఆయా డిపో మేనేజర్ల నెంబర్లు ఖమ్మం 9959225958, సత్తుపల్లి 9959225962, మణుగురు 9959225963 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలి


రాకాసితండాలో అవగాహన కల్పిస్తున్న గౌతమ్

తిరుమలాయపాలెం,జూన్13(ఆంధ్రజ్యో తి): వరదల సమయంలో ప్రజలు అప్ర మత్తంగా ఉండి తమ ప్రాణాలు కాపాడు కోవాలని ఎన్డీఆర్ఎఫ్ టీం కమాండర్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం మండలం లోని రాకాసితండాలో బృందం పర్యటిం చింది. గ్రామస్తులతోసమావేశంలో ఆయన మాట్లడుతూ గతేడాది వరదలతో గ్రామంలో అపార నష్టం జరిగిందని, విప త్తులు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కో వాలి అవగాహన కలిపించారు. వరదలు, అగ్రిప్రమాదాలు జరిగినప్పుడు అందుబా టులో ఉన్న వనరులతో ఏవిధంగా బయ టపడవచ్చో వివరించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్, తహసీ ల్దార్ లూథర్‌విల్సన్ పాల్గొన్నారు.

భూ సమస్యలు భూ భారతితో పరిష్కారం

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి
- పీఏసీఎస్ అధ్యక్ష, కార్యదర్శులకు చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, జూన్13(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం ద్వారా ప్రజల భూ సమ స్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డీసీసీబీ చైర్మన్ దొండ పాటి వెంకటేశ్వరరావుతో కలిసి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు, కో ఆపరే టివ్ అధికారులకు భూ భారతి చట్టంపై అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు భూ భారతి చట్టం తీసుకుని వచ్చిందన్నారు. దీని ద్వారా భూ సమస్యలు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై ప్రజలకు అభ్యంతరం ఉంటే అప్పీల్ చేసుకునే అవకాశం భూభారతి చట్టం కల్పించింద న్నారు. తహసిల్దార్ నుంచి సీసీఎల్ఏ వరకు అప్పీల్ చేసుకోవచ్చని, గతంలో కేవలం సివిల్ కోర్టుల ద్వారా మాత్రమే పరిష్కారం లభించే దన్నారు. ప్రస్తుతం రెవెన్యూ వ్యవస్థ దగ్గర అందుబాటులో ఉంటుందన్నారు. వారసత్వం, వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్ర మిస్తే తహసీల్దార్ విచారణ జరిపి హక్కుల రికార్డులో మ్యుటేషన్ చేస్తారని, తహసీల్దార్ నిర్ణీత వ్యవధి 30రోజులలోగా విచారణ జరిపి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. పెండింగ్ సాదాబైనామా సమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ భూభారతిపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లాసహ కార అధికారి గంగాధర్, డీసీసీబీ సీఈఓ వెంకటఆదిత్య, వరంగల్ తెలంగాణ కోఆపరే టివ్ యూనియన్ వైస్ ప్రిన్సిపల్ రాజయ్య, కోఆపరేటివ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు ప్రకృతి సహకారం

- నాట్లు పడక ముందే రైతుభరోసా
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రఘునాథపాలెంలో రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన


చిన్నారి చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, జూన్12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఇందిరమ్మ ప్రజాపాలనకు ప్రకృతి కూడా సహకరిస్తోందని, నాట్లు పడకముందే రైతుల బ్యాంకు ఖాతాలకు రైతు భరోసా అందుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్ర వారం రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విస్తృతంగా పర్యటిం చారు. రేగులచెలక, కొయచెలక కామంచికల్‌లో మొత్తం రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపనలు చేశారు. పలు సీసీ రహదారులను ప్రారంభించారు. రైతులతో కలు పుగోలుగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులకు యూనిఫాంలు అందించారు. రైతులు వ్యవసాయంపై ఎంతో ఆశతో ఉన్నా రని ఇదే క్రమంలో పెట్టుబడికి డబ్బులు లేవని బెంగ కూడా ఉంటుందని, తాను రైతును కాబట్టి రైతు బాగోగులు తెలుసునన్నారు. ఇప్ప టికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి రైతు భరోసా నిధుల విడుదలపై చర్చించామన్నారు. నాట్లు పడక ముందే రైతు భరోసా డబ్బులు బ్యాంకు ఖాతాలకు చేరతాయని మంత్రి తుమ్మల అభయమిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాకు మంచి పేరు ఉందన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు ఎంతో సహకరిస్తున్నారన్నారు. వర్షాకా లంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని హితవు పలికారు. ప్రజలు సహకరిస్తే పట్టణాల తరహాలో పల్లెల్లోను రెండు వరసల రహదారులు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు,ఏఎంసీ మాజీ చైర్మ న్ మానుకొండ రాధాకిషోర్, పీఏసీఎస్ అధ్య క్షులు తాతా రఘురాం, రావూరి సైదుబాబు, మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానా యక్, జెడ్పీ సీఈవో దీక్షారైనా పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ అంతరాయాల గుర్తింపు..ఇక సులువు

- విద్యుత్ తీగలకు ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు



ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):ఇకపైదైనా ప్రాంతంలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే గుర్తించం సులువుగా మారింది. ఆ ప్రాంతంలోని అన్ని విద్యుత్ తీగలను ట్రాన్స్ ఫార్మర్లను చెక్ చేయాల్సిన అవసరం లేకుండా 11కేవీ, 33కేవీ ఫీడర్లు లైన్‌లకు ఆధు నిక ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు అందుబాటు లోకి వచ్చాయి. విద్యుత్ తీగలకు ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు ఏర్పాటు చేసిన తర్వాత ఆ విద్యుత్ తీగల నుంచి విద్యుత్ సరఫరా జరిగితే గ్రీన్ లైట్ చూపిస్తుంది. ఇలా విద్యు త్ తీగలను పరిశీలించి సాధారణ ప్రజల నుంచి విద్యుత్‌శాఖ ఉద్యో గుల వరకు తమ ప్రాంతంలో విద్యుత్ సరఫరాపై తెలుసుకునే అవకాశం ఏర్పాటు చేశారు. జిల్లాలో జిల్లాలో 200 ప్రాంతాల్లో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు ఏర్పాటుకు రంగం సిద్ధం చేశామని ఖమ్మం టీజీ ఎన్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీరు ఇను గుర్తి శ్రీనివాసాచారి తెలిపారు.

కళాశాలలో ఫలితాల సాధనకు కృషి చేయాలి

తిరుమలాయపాలెం,జూన్13(ఆంధ్రజ్యో తి): ప్రభుత్వ కళాశాలలో మంచి ఫలితాలు సాధనకు అధ్యాపకులు కృషిచేయాలని జిల్లా ఇంటర్‌మీడియెట్ అధికారి రవిబాబు తెలి పారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు అందించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించి మంచి ఫలి తాలు సాధించాలన్నారు. అలాగే అత్యధికమా ర్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభి నందించారు. ఈకార్యక్రమంలో ప్రినర్సిపాల్ శ్రీనిఆసవరావు, నారాయణరావు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో పని చేస్తూ పార్టీని బలోపేతం చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

కామేపల్లి, జూన్12(ఆంధ్రజ్యోతి): ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్క రిస్తు సీపీఎంని బలోపేతం చేయాలని జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొత్తలింగాల ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో వైరా డివిజన్ స్థాయి రాజ కీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో ప్రజా క్షేత్రంలో ఉంటూ పని చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్య పరుస్తు, సమీకరించి పోరాటాలు చేయాలన్నారు. రాష్ట్ర నాయకుడు పి. సోమయ్య పార్టీ విశి ష్టత అనే అంశాన్ని బోధించారు. వర్గ పోరాటాలతో సమస్యలు పరిష్కారం అవు తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా వీరభద్రం, వింజం నాగభూషణం, దుగ్గి క్రిష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, అంబడి శ్రీనివాసరెడ్డి, కే. నరేంద్ర, నాగేశ్వ రరావు, చలపతిరావు, మణి, కుటుంబ రావు, బాదావత్ శ్రీను పాల్గొన్నారు.

బస్టాండ్ క్యాంటీన్‌లో అపరిశుభ్రత

- ప్రయాణికుల ఫిర్యాదుతో అధికారుల తనిఖీలు
- ప్లాస్టిక్‌వాడకం, అపరిశుభ్రతతో రూ.2 వేల జరిమానా


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నూతన బస్టాం డ్‌లో శుక్రవారం ఉదయం ఓ ప్రయాణికుడు క్యాంటీన్‌లో వాటర్‌బాటిల్ కొనేందుకు వెళ్లాడు. బాటిల్‌పై రూ.20లు ఉండగా క్యాంటీ న్ సిబ్బంది రూ.30 ఇవ్వాలని డిమాండ్ చేశా రని, క్యాంటీన్ అంతా అపరిశుభ్రంగా ఉండ టంతో ఆ ప్రయాణికుడు మునిసిపల్ శాని టరీ సూపర్‌వైజర్ సుబ్బయ్యకు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సూపర్‌వైజర్ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సిబ్బం దితో కలిసి బస్టాండ్ క్యాంటీన్‌కు వెళ్లారు. సిబ్బంది లోపలికి అనుమతించకుండా అడ్డు కున్నారు. దీంతో మునిసిపల్ సిబ్బందికి క్యాంటీన్ సిబ్బందికి కొంత ఘర్షణ జరిగింది. అనంతరం సూపర్‌వైజర్ సుబ్బయ్య క్యాంటీ లో పరిసరాలను పరిశీలించారు. అధికంగా ప్లాస్టిక్ వాడకం ఉండటంతో పాటు క్యాంటీన్ స్థలంలో అంతా అపరిశుభ్రంగా ఉండటంతో కేవలం ప్లాస్టిక్ వాడకానికే నామమాత్రపు జరి మానా రూ.2వేలువిధించారు.రోజువేల మంది ప్రయాణికులు ప్రయాణాలు సాగిస్తున్న ఈ బస్టాండ్‌లో అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తుండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రయాణికులు ఫిర్యాదు చేస్తే తప్ప తనిఖీలు ఉండవని తెలుస్తుంది.

నూతన కలెక్టర్‌కు స్వాగతం పలికిన అధికారులు



ఖమ్మంరూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కలెక్టర్‌గా పనిచేసిన ముజమ్మిల్ ఖాన్ బదిలీ అయిన విషయం తెలిసిందే.. నూతన కలెక్టర్‌గా అనుదీప్ ఇక్కడ బాధ్య తలు చేపట్టేందుకు హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తున్న ఆయనకు రూరల్ మండ లంలోని సత్యనారాయణపురం బైపాస్‌రో డ్డులో రూరల్ తహసీల్దార్ పిల్లి. రాంప్ర సాద్, ఏదులాపురం మునిసిపల్ కమిష నర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పుష్పగు చ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, రెవెన్యూ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు

తిరుమలాయపాలెం, జూన్13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబి రాలు నిర్వహించారు. ప్రస్తుత వర్షాకా లంలో వ్యాధులు అరికట్టేందుకు మండలం లోని జల్లేపల్లి, మేడిదపల్లి, కొక్కిరేణి, తది తర గ్రామాల్లో ఈ శిబిరాలునిర్వహిం చారు. ఆయా గ్రామల్లో రక్తనమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు అందించారు. అలాగే వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా క్లోరినేషన్ చల్లారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అవినాష్, హెచ్‌ఈవోలు మానస, రామయ్య, సీహెచ్ఎన్ వినయకుమారి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు మదన్‌లాల్ సంస్మరణ సభ

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్13(ఆంధ్ర జ్యోతి): వైరా మాజీఎమ్మెల్యే బానోత్ మద న్‌లాల్ సంస్మరణసభ శనివారం ఖమ్మంన గరంలోని జడ్పీసమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు విద్యా వంతుడిగా, సర్పంచ్ స్థాయినుంచి క్రమక్ర మంగా వైరా ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన మదన్‌లాల్‌సేవలు మరువలేనివన్నారు. అన్నివర్గాల ప్రజలు హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు సడలించాలి

కూసుమంచి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు సడలించాలని బీజేపీ నాయకుడు గుండా ఉపేందర్‌రెడ్డి తెలిపారు.నిరుపేదలకు ఇళ్లు మంజూరీ అని చెప్పి నిబంధనల పేరుతో ఇబ్బందులకుగురిచేయటం సరికాదన్నారు. ముందుగానే నగదు జమ చేయాలని, పెట్టుబడులు లేక ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ

ఖమ్మంఖానాపురంహవేలి,జూన్13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యను అభ్య సించే పిల్లలకు 50శాతం ఫీజురాయితీను ఇస్తూ అధికారులు సర్కు లర్ జారీ చేశారని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకు తోట. ఆదినారాయణ శుక్రవారం తెలిపారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు, ఇంటర్మిడియట్ విద్యను అభ్యసిస్తున్న జర్నలిస్టు పిల్లలకు రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

విమాన ప్రమాద మృతులకు సంతాపం

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్13 (ఆంధ్రజ్యోతి): గురువారం జరి గిన విమాన ప్రమాదంలో మృతిచెందిన ప్రయాణికులకు, మెడికల్ కళాశాల విద్యార్థులకు సంతాపం తెలుపుతూ శుక్రవారం రాత్రి నగరం లోని ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద డాక్టర్ మెడికల్ అకాడమీ నిర్వాహకులు, విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నల్ల దుస్తులు ధరించి మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సతీష్, భరణీకుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

కూలర్ వితరణ

తిరుమలాయపాలెం,జూన్13(ఆంధ్రజ్యోతి): తిరమలాయపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ మొదటి కేంద్రానికి కేతినేని వెంకటేశ్వర్లు కుమారుడు అన్వేష్ వాటర్‌కూలర్‌ను వితరణగా అందించారు. ఈకార్య క్రమంలో అంగన్‌వాడీ టీచర్ గీత తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్,జూన్13(ఆంధ్రజ్యోతి): జూలై7న జరిగే ఎంఆ ర్‌పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ విజయ్‌మాదిగ, వీహెచ్‌పీఎస్ జాతీయ మహిళ అధ్యక్షురాలు సామినేని భవానిచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మంనగరంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19న మంద కృష్ణ మాదిగకు అభినందన సభ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాజన సోష లిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య మాదిగ, ఎంఆర్‌పీ ఎస్ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు కూరపాటి సునిల్‌మాదిగ, గాజుల నర సింహారావు, తూరుగంటి రాము, బాకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

కూసుమంచి, జూన్ 13(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ బడుల్లో ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన ఉంటుందని, తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కూసుమంచి ఎంఈవో రాయల వీరా స్వామి తెలిపారు. బడిబాటలో భాగంగా విద్యాశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కూసుమంచి పీఎస్‌లో పిల్లలతో అక్షరాలు దిద్దించి, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మండ్రాజుపల్లి పాఠశాల తనిఖీ

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో, సకల సౌకర్యాలతో క్వాలీఫైడ్ టీచర్లతో కార్పొరేట్‌స్థాయిలో విద్య అందిస్తున్నట్లు సీఎంవో రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మండ్రాజుపల్లి పాఠశాలను ఆక స్మికంగా తనిఖీ చేశారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా చూడా లని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగుల్‌మీరా, ఉపాధ్యాయులు నాగుల్‌మీరా, స్వరూపారాణి, అంగన్‌వాడీలు సుజాత, నవ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

కవిత డిగ్రీ కళాశాల విద్యార్థినికి గోల్డ్ మెడల్


సహజ

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూని వర్సిటీ ప్రకటించిన ర్యాంకుల్లో నగ రంలోని కవితా డిగ్రీ కళాశాల విద్యార్థిని అనుమల. సహజ బీఎస్సీ బయోటెక్నాలజీ విభాగంలో మొద టటి ర్యాంకు తోపాటు గోల్డ్ మెడల్ సాధించాందని కళాశాల కరస్పాం డెంట్ పారుపల్లి ఉషా కిరణ్‌కు మార్ శుక్రవారం తెలిపారు. జూలై 7న జరు గనున్న యునివర్సిటీ స్నాతకోత్సవంలో గవ ర్నర్ బంగారు పతకం అందజేయనున్నారు.

పీజీ కళాశాలలో 12 మందికి

కాకతీయ విశ్వవిద్యాలయం 23వ స్నాతకోత్సవం సందర్భంగా ఎస్ఆర్‌బీ జీఎన్ఆర్ పీజీకళాశాలలో 12మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నారు. ఈ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలి పారు. 2016నుంచి 2020 విద్యాసంవ త్సరం వరకు 12 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిని శుక్రవారం కళాశా లలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి రామారావు



బోనకల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా అందరూ కృషి చేయాలని జిల్లా ఎన్‌సీడీ(అసంక్రమిత వ్యాధుల) ప్రోగ్రాం అధికారి రామారావు కోరా రు. బోనకల్ పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీ లించి, ఆసుపత్రిలో ఓపీ సేవలు, మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగా హన కల్పించాలని సూచించారు. అనంతరం ముష్టికుంట్ల గ్రామంలోని ఆయుష్మన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించారు. అక్కడ అందించే సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, దానయ్య, సాయి ప్రియాంక, రాధాలత, శ్రీవాణి, నాగరాజు తది తరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం

ముదిగొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో రమణయ్య సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎడవల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: మండలంలోని కొమ్ముగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చిన్నారులతో అక్షరాలు దిద్దించి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదనాచారి, ఉపాధ్యాయులు టీ.ఇందిరాదేవి, మస్తాన్‌బీ, చిన్నారులు, తల్లీదండ్రులు పాల్గొన్నారు.

పెనుబల్లి: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్.సత్యనారాయణ సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతగూడెం, మర్లకుంట, కేఎంబంజర్, గణేశులపాడు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కె.మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు నాగేంద్రరావు, ఆంథోని, వెంకటలక్ష్మి, డి.కుమారి, సీఆర్పీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని వెంగన్నపేట ప్రాథమికోన్నత పాఠశాల, తల్లాడ ప్రాథమికపాఠశాలలో జరిగిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఎంఈవో దామోదరప్రసాద్ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఎంలు ఉంగరాల వెంకటేశ్వర్లు, వై.రామిరెడ్డి, కోటగిరి రాధ తదితరులు పాల్గొన్నారు.



కొమ్ముగూడెం పాఠశాలలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

నోట్‌బుక్స్ పంపిణీ

వేంసూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంటపాడు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు చెరుకు రవీందర్‌రెడ్డి, గోళి మహేందర్‌రెడ్డిలు సమకూర్చిన నోట్‌పుస్తకాలు, బ్యాగులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్.వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు గడ్డం రాజశేఖర్‌రెడ్డి, సంధ్యారాణి, చెరుకు కృష్ణారెడ్డి, ఉష తదితరులు పాల్గొన్నారు.



తల్లాడలో...



వేంసూరులో దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



ముదిగొండలో....

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

▸▸ 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్



మాట్లాడుతున్న న్యాయాధికారి మారగాని శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్, జూన్13 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులంతా విజయవంతం చేయాలని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన సత్తుపల్లి కోర్టు ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేసుల పెండింగ్ భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా న్యాయవాదులు కృషి చేయాలని, కక్షిదారులను చైతన్యపరిచి వారిలో స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడే విధంగా న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ ఎస్‌కే.మీరాఖాసీం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపూల వెంకటేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

▸▸ జిల్లా ఎన్‌సీడీ పోగ్రాం అధికారి రామారావు



పీహెచ్‌సీలో ఓపీ సేవల వివరాలను తెలుసుకుంటున్న రామారావు

బోనకల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా అందరూ కృషి చేయాలని జిల్లా ఎన్‌సీడీ(అసంక్రమిత వ్యాధుల) ప్రోగ్రాం అధికారి రామారావు కోరారు. బోనకల్ పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, ఆసుపత్రిలో ఓపీ సేవలు, మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ముష్టికుంట్ల గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించారు. అక్కడ అందించే సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, దానయ్య, సాయి ప్రియాంక, రాధాలత, శ్రీవాణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కొణిజర్ల, జూన్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మపాలెం, చిన్నగోపతి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ రాము తనిఖీ చేశారు. చిన్నారులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం, యూనిఫాంతో టీచర్ల బోధన, సమయానికి అంగన్‌వాడీ కేంద్రాలను తెరుస్తున్నారా లేదా విషయాలను పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అశోక్ ఉన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

కారేపల్లి, జూన్13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తురక నారాయణ శుక్రవారం తెలిపారు. ఆదివారం ప్రత్యేక పూజలు, సోమవారం మహా అన్నదానం,మంగళవారం పెద్దమ్మతల్లి గ్రామసేవ ఊరేగింపు జరుగుతుందన్నారు. 18నబుధవారం గ్రామభక్తులు, మహిళలచే బోనాల సమర్పించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏన్కూరు, జూన్13(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు బీసీ బాలుర వసతిగృహంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ ప్రశాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి దూర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 9493417656 నెంబరులో సంప్రదించాలని కోరారు.

తాగునీటి బోరు ఏర్పాటు

కారేపల్లి, జూన్13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాణిక్యారం పంచాయతీ రూప్లా తండాలో శుక్రవారం గ్రామస్థులు తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇటీవల దేవతమూర్తు విగ్రప్రతిష్ఠల సందర్భంగా ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద తాగునీటి బోరును ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను వేడుకున్నారు. ఈవిషయం తెలిసిన గ్రామానికి చెందిన భూక్యా రాందాస్ ముందుకు వచ్చి తన తండ్రి భూక్యా చంద్యా జ్ఞాపకార్థం బోరు వేయించారు. దీంతో గ్రామస్థులు రాందాస్‌ను అభినందించారు.

నిబంధనలు పాటించాలి

బోనకల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేటు పాఠశాలల నిర్వహణ చేపట్టాలని, ఉల్లంఘిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో దామాల పుల్లయ్య హెచ్చరించారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతో బోధన చేయించాలని సూచించారు.

పోటు సత్యంకు నివాళి

వైరా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ నాల్గో వార్డులో శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు పోటు సత్యనారాయణ(75) అలియాస్ పోటు సత్యం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. సత్యనారాయణ భౌతికకాయంపై కాంగ్రెస్ జెండా కప్పి పూలమాల వేసి పార్టీ నాయకులు నివాళులర్పించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, నాయకులు దొడ్డా పుల్లయ్య, పమ్మి అశోక్, పాలేటి నర్సింహారావు, పోటు మధు, పెద్దప్రోలు లక్ష్మయ్య, బొర్రా గోవిందరావు, కట్ల సంతోష్, నాగరాజు, రేచర్ల నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, బండ్ల కృష్ణ తదితరులు నివాళులర్పించారు.

ప్రైవేట్ విద్యా సంస్థలను మూసి వేయాలి



ఎంఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బోనకల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలను తక్షణమే మూసి వేయాలని, అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొనుకుల సుధాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని రావినూతల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలపై ఎంఈవో దామాల పుల్లయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించాలని, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగే ప్రైవేటు పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మర్రి సాయికుమార్, బంక శ్రీను తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏన్కూరు, జూన్13(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీజేఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డిని కలిసి డిమాండ్ల తోకూడిన వినత్రిత్రం అందించారు. 250 గజాల ఇంటిస్థలం, రూ.25వేల పింఛన్, సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాలని తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు పత్రాలు ఇవ్వాలని వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో టీజేఎస్ జిల్లా కన్వీనర్ వి.బాబు, నరసింహారావు , మోహన్ దేవదాసు, డి.గణేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

▸▸ టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు

వైరా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తిదారుల అభివృద్ధి, సంక్షేమం కోసం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు పేర్కొన్నారు. స్థానిక సాయిబాబా కల్యాణమండపంలో శుక్రవారం కాంగ్రెస్ అనుబంధ నాయీబ్రాహ్మణ సమైఖ్య సేవసంఘం ఆధ్వర్యంలో పట్టణ, మండల కమిటీలను ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ సమైఖ్య సంక్షేమసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజ్జల వెంకన్న, దేవరకొండ శ్రీనివాసరావులు కూడా ఈ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. వైరా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా కేతవరపు నారాయణరావు, మంచికంటి అప్పారావు, ఉపాధ్యక్షుడిగా మురళీ, కోశాధికారిగా సతీష్, గౌరవ సలహాదారుడిగా కుదురుపాక సుధాకర్, మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఉప్పె వెంకటేశ్వర్లు, కుదురుపాక భాస్కర్, ఉపాధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా గజ్జల పెద్దవెంకట్, గౌరవ సలహాదారుగా సీతరాములు అలాగే మండల మహిళా సంఘం అధ్యక్షురాలిగా శ్రీకాకుళం సుజాత, ఉపాధ్యక్షురాలిగా నాగమ్మ, కార్యదర్శిగా శ్రీకాకుళం విజయలక్ష్మీ, కోశాధికారిగా నాగమణి ఎన్నికయ్యారు. వైరా మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు దార్న రాజశేఖర్, కట్ల నాగరాజు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, రాచబంటి రామకృష్ణ, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కుదురుపాక శ్రీహరి, మాధవరావు, హరినాథ్, తుమ్మల నాగభూషణం, సత్యనారాయణ, లింగపల్లి అప్పారావు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గంతో కాంగ్రెస్ నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

కల్లూరు, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వాచ్యానాయక్‌తండా, చిన్నకోరుకొండి, పెద్దకోరుకొండి గ్రామాల్లో శుక్రవారం ఆర్డీవో ఎల్. రాజేంద్రగౌడ్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఉన్న సదరు లబ్ధిదారులు అర్హుల కాదా అన్న విషయంపై సమగ్ర సమాచారం సేకరించి తుది కసరత్తుగా వారి ఎంపికకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిరాజు అన్నమరాజు, మచ్చా వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరలకే విత్తనాలు అమ్మాలి

తల్లాడ, జూన్13(ఆంధ్రజ్యోతి)ప్రభుత్వం నిర్ణయించిన ధరలే విత్తనాలు అమ్మాలని ఏడీఏ శ్రీనివాసరెడ్డి తెలిపారు శుక్రవారం మండలంలో పలు విత్తన, ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే విక్రయించాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో ఏవో ఎండీతాజుద్దీన్, ఏఈవోలు పాల్గొన్నారు.

రైతు భరోసాను వెంటనే అందించాలి

▸▸ సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రాబాబు

కొణిజర్ల, జూన్13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే రైతులకు రైతు భరోసాను అందించాలని సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రాబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గుబ్బగుర్తి, అంజనాపురం గ్రామాలలో జరిగిన శాఖా మహాసభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంజనాపురం గ్రామశాఖ కార్యదర్శిగా బానోతు రమేష్, గుబ్బగుర్తి గ్రామశాఖ కార్యదర్శిగా దొబ్బనబోయిన వెంకటనర్సయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు వెంకన్న, మద్దిని కోటేశ్వరరావు, చల్లగుండ్ల మురళి, నల్లమోతు పిచ్చయ్య, దొబ్బనబోయిన శేషయ్య, శ్రీనువాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో అధ్యాపకుల ప్రచారం



కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్న జేవీఆర్ కళాశాల అధ్యాపకులు

సత్తుపల్లి, జూన్13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో డిగ్రీ విద్యలో చేరేందుకు ఈనెల 19వ తేదీ ఆఖరని ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపీ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల పరిధిలోని ఇంటర్మీడియేట్ పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి డిగ్రీలో చేరాలని తమ అధ్యాపకులు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. తమ కళాశాలలో దోస్త్ ఆన్‌లైన్ ఉచితంగా చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్‌తో పాటు నోట్‌బుక్స్ ఉచితంగా అదిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

'ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి'

పెనుబల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు సాగుచేసుకున్న పోడుభూములకు హక్కుపత్రాలు పొందిన రైతులకు ప్రభుత్వ పథకాలు అమలుచేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మళకుంటలో పోడుసాగుదారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజినేని మంగమ్మ, గాయం తిరుపతిరావు, బేతి రామకృష్ణ, బోడ రాములు, నల్లబోతుల కృష్ణ, కోట సీత పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం

వైరా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వైరా మండలం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ర్యాంకులు సాధించిన పేద విద్యార్థులకు మునిసిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామానికి చెందిన ప్రవాసభారతీయుడు కొండబోలు సురేష్‌బాబు రూ.1.20లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రోత్సాహకంగా అందజేశారు. 21మందికి రూ.1.20లక్షల ఆర్థికసహాయాన్ని అందజేశారు. అలాగే సురేష్‌బాబు సోదరి కొండబోలు లలిత బీటెక్ పేద విద్యార్థిని హరి భవ్యశ్రీకి రూ.పదివేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వైరా మండల వైద్యాధికారి బత్తినేని శ్రీహర్ష, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు డి.మాధవరావు, డి.సత్యనారాయణ, చావా శ్రీనివాసరావు, సూర్యకుమారి, ఇమాన్యుయేల్, రెబ్బవరం ఉపాధ్యాయుడు జీవీ.సూర్యప్రకాశరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, ఎస్టీయూ, యూటీఎఫ్, ఎస్టీఎఫ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలి

వైరా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ వందరోజుల ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి సూచించారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని సోమవరం పల్లెదవాఖానాలో శుక్రవారం నిర్వహించిన ఈ ప్రోగ్రాంను ఆమె సందర్శించి పరిశీలించారు. అలాగే ఈ రోగులకు ఎక్స్‌రేలు కూడా తీసి అందిస్తామని తెలిపారు. జిల్లా క్షయనివారణ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు, డాక్టర్ బి.శ్రీహర్ష, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళావతిబాయి

ముత్యాలమ్మతల్లికి బోనాలు

కారేపల్లి, జూన్13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సామ్మ తండాలో శుక్రవారం ముత్యాలమ్మ తల్లికి గ్రామస్థులు బోనాలు సమర్పించారు. గ్రామంలో ముత్యాలమ్మతల్లి, నాభిశిల ప్రతిష్ఠల సందర్భంగా దేవతమూర్తులకు గ్రామస్థులు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ధారవత్ కళ్యాణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

నేడు మదర్‌థెరిస్సాలో జాబ్‌మేళా

సత్తుపల్లి, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలలో నేడు అపోలో ఫార్మసీ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ జాబ్ మేళాకు బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డీ.ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్, ఎస్ఎస్‌సీ చదివిన అభ్యర్థులు అర్హులని, ఎంపికైన పురుష అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అర్హతలు, అనుభవం కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

అధ్యాపకుడికి సన్మానం

వైరా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల డ్రైవ్‌కు సంబంధించి ఒక పాటను రచించి స్వరకల్పన చేసిన కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు ఎం.వెంకటముత్యాన్ని శుక్రవారం ప్రిన్సిపల్ ఎల్.నవీనజ్యోతి, సహచర అధ్యాపకులు సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అన్ని విషయాలను వివరిస్తూ విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఆలోచింపజేస్తూ వెంకటముత్యం స్వరకల్పన చేసిన పాటను ఈనెల 11న హైదరాబాద్‌లో తెలంగాణ ఇంటర్ బోర్డు డైరెక్టర్ శ్రీకృష్ణ ఆదిత్య ఆవిష్కరించారు. దాన్ని పురస్కరించుకొని వెంకటముత్యాన్ని ప్రిన్సిపల్ నవీనజ్యోతి శాలువాతో సన్మానించి అభినందించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

పెనుబల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని టీడీపీ జిల్లా నాయకుడు, సత్తుపల్లి నియోజకవర్గ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి కేతినేని హరీష్ పేర్కొన్నారు. శుక్రవారం పెనుబల్లిలో జరిగిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా తుమ్మలపల్లి రాజేశ్వరరావు, సయ్యద్ బాబు, ఉపాధ్యక్షులుగా కోమటి కృష్ణారావు, పంతంగి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా రాయల పిచ్చమ్మ, యలమద్ది మధుసూదన్‌రావు, కట్టేబోయిన మోహన్‌రావు, నరేష్, గుగులోతు రజనీకాంత్, గడ్డం పుల్లారావు, దొంతినేని ప్రసాద్, యరగొర్ల వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు పోట్రు రామారావు, కనగాల రాంబాబు, కోమటి జ్యోతి, మోరంపూడి చంద్రశేఖర్, కృష్ణయ్య, దస్తగిరి, రవీందర్‌రెడ్డి, కిషోర్, బెల్లంకొండ శ్రీనివాసరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో'..



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వైరా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని వైరా నియోజకవర్గ, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం వైరాలో జరిగిన ఆపార్టీ సమావేశంలో నియోజకవర్గ బాధ్యుడు చెరుకూరి చలపతిరావు, పలువురు నాయకులు మాట్లాడారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, బొల్లేపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పమ్మి అర్జున్‌రావు, మందడపు మధుసూదన్‌రావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, రాచబంటి కృష్ణయ్య, మద్దినేని రామారావు, చింతల శ్రీనివాసరావు, కట్టా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

తల్లాడ, జూన్13(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తల్లాడ తహసీల్దార్ వి.సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తెలగవరం గ్రామంలో జరిగిన భూ భారతి గ్రామసభలో ఆయన మాట్లాడుతూగతంలో భూరికార్డుల్లో తప్పులు సరిదిద్దేందుకు మండల, డివిజన్, జిల్లాస్థాయిల్లో అవకాశం లేకపోవడం వల్ల బాధిత రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని, తెలిపారు. ప్రస్తుతం భూభారతి చట్టం వల్ల క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పరిశీలించి, సమస్యలుపరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.